
శనివారం 28 మార్చి 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**ఆ పరిస్థితే ఉత్పన్నం కాదు..**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు

- వివరాలు 3 లో..

# టీమిండియా స్ఫూర్తితో పనిచేద్దాం

## సీఎంలతో వర్చువల్ భేటీలో ప్రధాని మోదీ పిలుపు

## యుద్ధం నేపథ్యంలో.. భారత్ విధానాలపై చర్చ



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడారు. సమావేశంలో పశ్చిమాసియా యుద్ధ పరిణామాలపై సమీక్షించిన ప్రధాని మోదీ, టీమిండియా స్ఫూర్తితో సమష్టిగా కృషిచేయడమే భేటీ ఉద్దేశమని వివరించినట్టు తెలుస్తోంది. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను సీఎంలకు ప్రధాని వివరించారు. సంక్షోభం దృష్ట్యా భద్రతకు విద్రోహ శక్తులు విఘాతం కలిగించే ప్రమాదముందన్న మోదీ.. తీర ప్రాంతాలు, సరిహద్దుల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

2



### కేంద్రం నిర్ణయాన్ని

## స్వాగతిస్తున్నాం..

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఏపీ స్వాగతిస్తోంది. సవాళ్ల సమయంలోనే నాయకత్వ పటిమ బయటపడుతుంది. క్లిష్టపరిస్థితుల్లో దేశానికి స్థిరత్వం కల్పిస్తున్న మోదీ నేతృత్వం దేశానికి ఒక వరం. అనేక దేశాలు ఇంధన ధరల భారం ప్రజలపై మోపుతున్నాయి. భారత్ మాత్రం ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకుంటోంది. ఇది ఎన్డీయే ప్రభుత్వ ప్రజా ప్రాధాన్యానికి నిదర్శనం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

### సంక్షేమ ప్రభుత్వమని

## మోదీ నిరూపించారు...



పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.10 తగ్గించారు. డీజిల్‌పై పూర్తిగా రద్దు చేశారు. ప్రజలకు ఉపశమనం కలిగించేలా తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీఏ నిరూపించుకుంది. ఇంధన కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే... పశ్చిమాసియా యుద్ధ ప్రభావం నుంచి ప్రజలకు ఊరటనిస్తూ ఇంధన ధరలు పెరగకుండా భారీగా ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

- విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్

## దేశ ప్రజలకు ఊరట



ప్రధాని మోదీ దేశ ప్రజల క్షేమంకోరే నాయకుడని నిరూపించుకున్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశ ప్రజలపై పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించి ఇంధన భారంనుంచి ఊరట కల్పించారు. ఇంధన కొరత రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తూనే.. ప్రజలపై భారం పడకుండా తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించడంతోపాటు, డీజిల్‌పై ఉన్న సుంకాన్ని పూర్తిగా రద్దు చేసినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు.

- పవన్ కళ్యాణ్, ఉప ముఖ్యమంత్రి



# ప్రజాసేవే పరమావధిగా..

- ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహణలో దాతలు, సిబ్బంది సహకారం మరువలేనిది
- త్వరలో విజయవాడ, అనంతపురంలో తలసేమియా సెంటర్లు ఏర్పాటు
- తలసేమియా వ్యాధిపై అవగాహనకు మే 10న హైదరాబాద్‌లో రన్
- మహిళలు ఆర్థికశక్తిగా ఎదగాలి: నారా భువనేశ్వరి
- కుప్పం నియోజకవర్గంలో ముగిసిన 4 రోజుల పర్యటన

4



## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు

- కేంద్రం నిర్ణయాన్ని సంకీర్ణ ప్రభుత్వం స్వాగతించింది
- ప్రజలపై భారం తగ్గించాలన్నది మోదీ సంకల్పం
- చంద్రబాబు మద్దతుతో సంక్షేమానికి ఊపు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

2



### మంత్రి అచ్చెన్న విజ్ఞప్తితో కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

- మొక్కజొన్న రైతుకు భారీ ఊరట దిశగా ప్రయత్నం

2

## ఆ భారం ప్రభుత్వంపైనే..!



- రూ.18 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం సర్కారు భరిస్తుంది
- కూటమి చేస్తున్న మంచి పనుల క్రెడిట్ కోసం జగన్ తాపత్రయం
- అద్దంకిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి గొట్టిపాటి

7



## కొత్త వడ్డెర సొసైటీలకు గ్రీన్ సిగ్నల్


- మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం
- వడ్డెర్లకు ఎన్నికల హామీలు నెరవేర్చిన మంత్రి లోకేశ్
- ప్రకటించిన మంత్రి సవిత

6

# విశ్వగవాక్షం.. అమరావతి!

అమరావతి (చైతన్య రథం): అమరావతిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) సహకారంతో రూ.150 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఖగోళ శాస్త్ర కేంద్రం 'కాస్మోస్-2' ఏర్పాటుకానుంది. విద్యార్థులకు ఖగోళ శాస్త్రం, గ్రహాలు, నక్షత్రాలపై అవగాహన కల్పించడం, సైన్స్ విద్యను పెంపొందించడంలో భాగంగా ఈ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు. అంటే -విశ్వం, గ్రహాలు, నక్షత్రాలు, గెలాక్సీలవంటి సంక్లిష్టమైన విషయాలపై స్పష్టమైన, దృశ్యమానమైన, పూర్తిగా లీనమయ్యే అవగాహనను విద్యార్థులకు అందించడం ద్వారా.. విజ్ఞానశాస్త్రం, ఖగోళశాస్త్రాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చే యోచనతో కాస్మోస్-2ని నెలకొల్పుతున్నారు. అధునాతన లెడ్ డోమ్ థియేటర్, ఇంటరాక్టివ్ సైన్స్ ప్రదర్శనలు, ఖగోళ పరిశోధనా సౌకర్యాలు.. ఈ కేంద్రంలోని ముఖ్యమైన ఫీచర్లు.


3



### డిప్యూటీ స్పీకర్, కూటమి నాయకులపై

## దాడిని ఖండించిన సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): ఉండి నియోవర్గం ఆకివీడు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామనవమి సందర్భంగా అక్కడ ఉన్న పురాతన ఆలయానికి పూజకు వెళ్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుపై, కూటమి నాయకులపై కొందరు దాడి చేయడాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు.



"దశాబ్దాలుగా నిరాదరణకు గురైన రామాలయ పునరుద్ధరణకు పూనుకున్న డిప్యూటీ స్పీకర్... పూజలకు వెళ్లిన సమయంలో, బయటి వ్యక్తులతో కలిసి కొంతమంది ఆయుధాలతో దాడికి తెగబడటం గర్హనీయం. భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకోవాల్సిన పవిత్ర సమయంలో ఇటువంటి సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదు. ఈరోజు జరిగిన దాడిలో కొందరు గాయపడి ఆసుపత్రి పాలవ్వడం దురదృష్టకరం. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు వ్యహరించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## మంత్రి అచ్చెన్న విజ్ఞప్తితో కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

**-మొక్కజొన్న రైతుకు భారీ ఊరట దిశగా ప్రయత్నం**

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను గమనించిన రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా వెంటనే చర్యలు చేపట్టారు. 2025-26 రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.83 లక్షల హెక్టార్లలో సాగు జరిగి 37 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి నమోదైనప్పటికీ, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధరకంటే తక్కువగా ఉండటంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. అత్యవసర అవసరాల నిమిత్తం రైతులు తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని వివరించిన మంత్రి, ఈ పరిస్థితుల్లో తక్షణమే కేంద్రం జోక్యం అవసరమని ముఖ్యమంత్రికి స్పష్టం చేశారు. రైతులకు న్యాయమైన ధర కల్పించాలనే లక్ష్యంతో ధర లోపం చెల్లింపు (పిడీపీఎస్ స్కీం)ను మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎమ్ఐఎస్) ద్వారా అమలు చేయాలని, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌కు 100శాతం నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించేలా చేయాలని, అలాగే ప్రస్తుత 25శాతం పరిమితిని 100శాతం ఉత్పత్తికి విస్తరించి, జూన్ 2026 వరకు పథకాన్ని కొనసాగించాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి లేఖ రాసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



# టీమిండియా స్ఫూర్తితో పనిచేద్దాం

**సీఎంలతో వర్చువల్ భేటీలో ప్రధాని మోదీ పిలుపు - యుద్ధం నేపథ్యంలో.. భారత్ విధానాలపై చర్చ**

ఢిల్లీ (చైతన్య రథం): పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడారు. సమావేశంలో పశ్చిమాసియా యుద్ధ పరిణామాలపై సమీక్షించిన ప్రధాని మోదీ, టీమిండియా స్ఫూర్తితో సమష్టిగా కృషిచేయడమే భేటీ ఉద్దేశమని వివరించినట్టు తెలుస్తోంది. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను సీఎంలకు ప్రధాని వివరించారు. సంక్షోభం దృష్ట్యా భద్రతకు విద్రోహ శక్తులు విఘాతం కలిగించే ప్రమాదముందన్న మోదీ.. తీర ప్రాంతాలు, సరిహద్దుల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సీఎంలకు సూచించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు వినా మిగతా రాష్ట్రాల సీఎంలతో



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రధాని మోదీ.. యుద్ధం ప్రభావం పడుతున్నవేళ రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలపై లోతుగా చర్చించారని కేంద్ర వర్గాలు వెల్లడించాయి. వర్చువల్ భేటీకి రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా హాజరయ్యారు.



ప్రధానితో వీడియో కాన్ఫరెన్స్‌కు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిలు హాజరయ్యారు. యుద్ధం మొదలయ్యాక ఇలాంటి సమీక్ష నిర్వహించడం ఇదే తొలిసారి.

# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు

- **కేంద్రం నిర్ణయాన్ని సంకీర్ణ ప్రభుత్వం స్వాగతించింది**
- **ప్రజలపై భారం తగ్గించాలన్నది మోదీ సంకల్పం**
- **చంద్రబాబు మద్దతుతో సంక్షేమానికి ఊపు**
- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



అమరావతి (చైతన్య రథం): పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సంకీర్ణ ప్రభుత్వం స్వాగతించిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ నిర్ణయం సమయోచితం, ప్రజాహితంగా పల్లా అభివర్ణించారు. ఆర్థిక ఇబ్బందులు నెలకొన్న తరుణంలో, పౌరులపై భారాన్ని తగ్గించడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి సిద్ధపడటం ప్రజా సంక్షేమంపట్ల కేంద్రానికి ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశంసిస్తూ, ఇలాంటి చర్యలు దూరదృష్టి, సంకల్పంతో కూడిన నాయకత్వాన్ని నొక్కి చెబుతాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన ధరల కారణంగా అనేక దేశాలు ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్న తరుణంలో, ప్రజలకు ఉపశమనం కల్పించాలన్న కేంద్రం నిర్ణయం.. ఎన్డీయే ప్రభుత్వంలో 'పౌరుడే ప్రథమం' అనే విధానానికి నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనిశ్చితి సమయాల్లోనే నాయకత్వానికి నిజమైన పరీక్ష ఎదురవుతుందని, కేంద్రం యొక్క సునిశితమైన స్పందనలు స్థిరత్వాన్ని కాపాడటంలోనూ, ప్రజా విశ్వాసాన్ని బలోపేతం చేయడంలోనూ దోహదపడ్డాయని పల్లా వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ఆయన పరిపాలనా చతురత, దీర్ఘకాలిక దార్శనికత కారణంగానే రాష్ట్రం సంక్షేమ ఆవశ్యకతలను, ఆర్థిక వివేకాన్ని సమతుల్యం చేసుకోగలిగిందన్నారు. కేంద్రం నిర్ణయానికి తక్షణ ఆమోదం తెలపడం, దాని ప్రయోజనాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేరేలా చేసే ప్రయత్నాలు, స్పందన మరియు సామర్థ్యంపై ఆధారపడిన పాలన నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పల్లా వ్యాఖ్యానించారు.

కేంద్రం నిర్ణయానికి తక్షణ ఆమోదం తెలపడం, దాని ప్రయోజనాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేరేలా చేసే ప్రయత్నాలు, స్పందన, సామర్థ్యంపై ఆధారపడిన పాలన నమూనాను ప్రతిబింబిస్తున్నాయన్నారు. కేంద్ర- రాష్ట్ర సమన్వయ ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూనే పౌరులపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఉన్న సంకీర్ణ ప్రభుత్వ విధానం, నిజమైన ప్రజాహిత పరిపాలన యొక్క సారాంశానికి నిదర్శనమన్నారు. ప్రజా ప్రయోజనాలకు ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం ఇస్తున్న ప్రాధాన్యత.. దేశంలో పరిపాలనకు ఒక ప్రమాణంగా నిలుస్తోందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# డీఎన్‌ఏ పరీక్షల ఫలితాల ఆధారంగా మృతదేహాల గుర్తింపు

***అంబులెన్సుల ద్వారా శనివారం స్వస్థలాలకు తరలింపు***

***వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి***

మార్కాపురం (చైతన్య రథం): మార్కాపురం జిల్లాలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో సజీవ దహనమై గుర్తుపట్టలేని విధంగావున్న 14మంది మృతదేహాలను తోబుట్టవుల డీఎన్‌ఏలతో గుర్తించారు. ఈమేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటన జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మంత్రి సమీక్ష జరిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురం శివారులో టిప్పర్‌ను ట్రావెల్స్ బస్సు గురువారం వేకువజామున ఢీకొట్టిన ఘటనలో 14మంది సజీవ దహనమయ్యారు. మృతదేహాలను మార్కాపురం జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. వీటికి పోస్టుమార్టం నిర్వహించినప్పటికీ మృతదేహాలు ఎవరివో గుర్తించలేని విధంగా ఉండడంతో గురువారం రాత్రి తోబుట్టువుల (మొత్తం 22మంది) నుంచి గుంటూరు రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఆర్ఎస్ఎస్ఎల్) నిపుణులు రక్త నమూనాలు సేకరించారు. గుంటూరునుంచి వచ్చిన వారికి ఒంగోలు జీజీహెచ్‌లోని ఫోరెన్సిక్ డిపార్టుమెంటు సహకరించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు నిపుణులతో సంప్రదింపులు జరిపారు. వారికి అవసరమైన సదుపాయాలు కల్పించారు.



తోబుట్టువులనుంచి సేకరించిన నమూనాలను గుంటూరులోని ల్యాబ్‌లో పరీక్షించారు. సమష్టి కృషివల్ల ఫలితాలు శుక్రవారం రాత్రి వెలువడ్డాయి. వీటి ఆధారంగా మృతదేహాల గుర్తింపు కార్డులోని వివరాలతో అనుసంధానం చేస్తున్నారు. శనివారం ఉదయంనుంచి తోబుట్టవులకు మృతదేహాలను అప్పగిస్తారు. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసే అంబులెన్సుల ద్వారా స్వస్థలాలకు మృతదేహాలను ఎస్కార్ట్ సాయంతో పంపనున్నారు. కందుకూరు. కనిగిరి, ఒంగోలు, నెల్లూరు జిల్లా బుచ్చివరకు మృతదేహాల తరలింపు జరగనుంది.

**తగిన జాగ్రత్తలతో..**

డీఎన్‌ఏ పరీక్షల నిర్వహణలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. చనిపోయిన వారి తోబుట్టవుల (రక్త సంబంధీకులు) నుంచి నమూనాలు సేకరించారు ఒక కేసు విషయంలో తండ్రి, బిడ్డ చనిపోయ్యారు. తండ్రిని ఆయన తల్లిదండ్రుల నుంచి సేకరించిన రక్త నమూనాలు, బిడ్డను తల్లి నుంచి సేకరించిన నమూనాను పరీక్షించడం ద్వారా మృతదేహాల గుర్తింపు సాధ్యమైంది.

**ఇద్దరికి శస్త్ర చికిత్స**

బస్సు ప్రమాదంలో గాయపడిన 20మంది ఒంగోలు, మార్కాపురం అసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒంగోలు జీజీహెచ్లో 16మంది, మార్కాపురం జీజీహెచ్లో 12మంది, ప్రైవేటు ఆసుపత్రిలో ఒకరు చొప్పున చికిత్స పొందుతున్నారని అధికారులు మంత్రికి వివరించారు. ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి కాళ్లకు శుక్రవారం శస్త్రచికిత్స చేశారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి వెంకటేశ్వర్లు, మార్కాపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ వెల్లడించారు. వైద్యుల సూచనలు అనుసరించి కోలుకున్న వారిని డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు.

# విశ్వగవాక్షం.. అమరావతి!

అమరావతి (చైతన్య రథం): అమరావతిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) సహకారంతో రూ.150 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఖగోళ శాస్త్ర కేంద్రం 'కాస్మోస్-2' ఏర్పాటుకానుంది. విద్యార్థులకు ఖగోళ శాస్త్రం, గ్రహాలు, నక్షత్రాలపై అవగాహన కల్పించడం, సైన్స్ విద్యను పెంపొందించడంలో భాగంగా ఈ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు.

అంటే -విశ్వం, గ్రహాలు, నక్షత్రాలు, గెలాక్సీలవంటి సంక్లిష్టమైన విషయాలపై స్పష్టమైన, దృశ్యమానమైన, పూర్తిగా లీనమయ్యే అవగాహనను విద్యార్థులకు అందించడం ద్వారా.. విజ్ఞానశాస్త్రం, ఖగోళశాస్త్రాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చే యోచనతో కాస్మోస్-2ని నెలకొల్పుతున్నారు. అధునాతన లెడ్ డోమ్ థియేటర్, ఇంటరాక్టివ్ సైన్స్ ప్రదర్శనలు, ఖగోళ పరిశోధనా సౌకర్యాలు.. ఈ కేంద్రంలోని ముఖ్యమైన ఫీచర్లు.

ఈ ప్రాజెక్ట్ కోసం ఏపీసీఆర్డీఏ ఐదు ఎకరాల భూమిని కేటాయించింది. లెడ్ డోమ్ టెక్నాలజీతో, ఇది అంతరిక్షం, గ్రహాల గమనాన్ని లైవ్‌లో చూపే అద్భుతమైన విద్యా, పరిశోధనా కేంద్రంగా నిలవనుంది. సాధారణ ప్లానిటోరియాల్లో రికార్డ్ చేసిన వీడియోలు చూపిస్తారు. కానీ అమరావతిలో రాబోయే ఈ కాస్మోస్-2 ప్రత్యేకత వేరు. ఇది కేవలం కళ్లతో చూసేది కాదు, నేరుగా అంతరిక్షంతో కనెక్టె విశ్వానుభూతిని పొందే వేదిక కానుంది. అంటే నక్షత్ర మండలాలు, గ్రహాల గమనాన్ని లైవ్‌లో చూస్తున్న అనుభూతి పొందుతామన్న మాట. సాంకేతికంగా.. పాత ప్రాజెక్టర్లకు భిన్నంగా, అత్యాధునిక లెడ్ డోమ్ టెక్నాలజీని 'కాస్మోస్-2' ప్లానిటోరియంలో వినియోగించనున్నారు. ఈ తరహా టెక్నాలజీలో దేశంలో ఏర్పాటవుతున్న ప్లానిటోరియంలలో అమరావతి రెండోది. మొదటిగా మైసూర్‌లో ఏర్పాటు చేసిన కాస్మోస్-1 ప్రాజెక్టుకు మించి కాస్మోస్-2ను ఏర్పాటు చేయనున్నారు. దక్షిణ భారతంలో అగ్రగామి ఖగోళ విద్యా కేంద్రంగా కాస్మోస్ -2 నిలవనుంది. లెడ్ డోమ్ టెక్నాలజీ రిజల్యూషన్, బ్రైట్‌నెస్ వీక్షకులను.. నిజంగానే అంతరిక్షంలో విహరిస్తున్నామనే సంభ్రమంలో ముంచెత్తనుంది.




బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ), భారత ప్రభుత్వ విజ్ఞాన, సాంకేతిక శాఖ, ఏపీసీఆర్డీఏల మధ్య 'కాస్మోస్-2' ఏర్పాటుకు సంబంధించి ఒప్పందం కుదిరినప్పటి చిత్రం

హన్లే లేదా కొడైకెనాల్‌లోని భారీ టెలిస్కోపులతో లైవ్ అనుసంధానంతో, నక్షత్ర మండలాల కదలికలను లైవ్‌లో చూసే అవకాశం.. కాస్మోస్-2 కలగజేయనుందన్న సమాచారం.. అంతరిక్ష ప్రేమికులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విద్యార్థులలో ఖగోళశాస్త్రంపై ఆసక్తిని పెంచడమే కాదు, రాష్ట్రంలో సైన్స్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఈ ప్లానిటోరియం ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

2026-27 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు కేంద్రం భారీ ఊతమిచ్చింది. బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ), భారత ప్రభుత్వ విజ్ఞాన, సాంకేతిక శాఖ, ఏపీసీఆర్డీఏ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. కేవలం 18 నెలల కాలపరిమితితో ఈ ప్రాజెక్టను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే 2027 నాటికల్లా అమరావతి గగనతలంనుంచి తారలను తాకే అవకాశం రాబోతోంది. ఇది కేవలం టూరిస్ట్ స్పాట్ మాత్రమే కాదు, భవిష్యత్ శాస్త్రవేత్తలను తయారు చేసే రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్.

"టెలిస్కోప్ ద్వారా ఆకాశాన్ని చూడటం ఒక ఎత్తైతే.. ప్రపంచస్థాయి టెక్నాలజీతో నక్షత్రాల మధ్య విహరించేలా అనుభూతిని పొందడం మరో ఎత్తు." అమరావతి కాస్మోస్-2 ఆ అనుభవాన్నే మనకు అందించబోతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే దక్షిణ భారతదేశంలో అమరావతి ఆస్ట్రో-టూరిజానికి కేరాఫ్ అడ్రస్ అవుతుందనడంలో ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో నాణ్యమైన విద్యా, సాంస్కృతిక మౌలిక సదుపాయాలను ఏకీకృతం చేసే బృహత్ ప్రణాళికలో ఈ కార్యక్రమం ఒక భాగం. సో, కాస్మోస్-2తో అమరావతి సైన్స్, రీసెర్చ్ హబ్‌గా మారనుందని బలంగా చెప్పొచ్చు.




## ఆ పరిస్థితే ఉత్పన్నం కాదు..

### వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు



దిల్లీ: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేసే పరిస్థితులు ఉత్పన్నం కావని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. శుక్రవారం రాజ్యసభలో వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. దేశంలో ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న అన్ని స్టీల్ ప్లాంట్లలో మాదిరిగానే కొన్ని కార్యకలాపాల కోసం కొన్ని ఏజెన్సీల సాయం తీసుకుంటున్నట్టు చెప్పారు. "రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆస్తులన్నింటినీ ఆ సంస్థ శాశ్వత ఉద్యోగులే నిర్వహిస్తున్నారు. కొన్ని కార్యకలాపాల కోసం కొన్ని ఏజెన్సీల నుంచి సాయం తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వరంగంలోని ఇతర స్టీల్ ప్లాంట్ల తరహాలోనే ఈ చర్యలు ఉన్నాయి" అని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇవి దశలవారీగా ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం కిందికి రావని పేర్కొన్నారు.

## బీసీ భవన్‌కు రూ.కోటి విరాళమించిన మంత్రి నారాయణ




నెల్లూరు (టౌన్): రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరు నగరంలోని బీసీ భవన్ నిర్మాణానికి రూ.కోటివిరాళం అందించారు. శుక్రవారం మంత్రి అల్లుడు గంటా రవితేజ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పలువురు బీసీ నేతలతో కలిసి కలెక్టర్ హిమాన్షు శుక్లాకు రూ.కోటి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ సమాజంలో అన్నివర్గాలకు ఆత్మగౌరవ భవనాలు అందుబాటులో ఉండాలన్నదే మంత్రి ఆశయమని తెలిపారు. విద్య, వైద్య రంగాలతోపాటు సామాజిక భవనాల నిర్మాణానికి ఆయన అందిస్తున్న చేయూతపై జిల్లావ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. కార్యక్రమంలో మేయర్ సుజాత, రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆకివీడులో ఉద్రిక్తత!

### డిప్యూటీ స్పీకర్‌ను అడ్డుకున్న ఒక వర్గం

ఆకివీడు (చైతన్యరథం) పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం పెద్దపేటలో ఉద్రిక్తత నెలకొంది. శిథిలావస్థకు చేరిన రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా పూజలు నిర్వహించేందుకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వెళ్లారు. ఆయన రాకను వ్యతిరేకిస్తూ.. ఒక వర్గం ఆందోళనకు దిగింది. శిథిలావస్థకు చేరిన ఆలయం స్థానంలో నూతన గుడిని కట్టిస్తామని రఘురామ ఇటీవల ప్రకటించారు. అయితే, ఆ ప్రాంతంలో గుడి నిర్మించవద్దని, గొంతెనమ్మ ఆలయం కట్టాలని ఆ వర్గం కోరుతుంది. ఈ నేపథ్యంలో కొందరు శ్రీరామనవమివేళ పూజలో కూర్చున్న రఘురామను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల సహకారంతో గుడి లోపలకి వెళ్లి పూజలు చేసిన తర్వాత... రఘురామ వెళ్లిపోయారు. అనంతరం రామాలయం కట్టాలంటున్న వారు.. వ్యతిరేకిస్తున్న వర్గం పరస్పరం రాళ్లు రువ్వుకొని దాడులు చేసుకున్నారు. పోలీసులు వారిని అదుపు చేశారు.



చైతన్యరథం

# ప్రజాసేవే పరమావధిగా..

- ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహణలో దాతలు, సిబ్బంది సహకారం మరువలేనిది
- త్వరలో విజయవాడ, అనంతపురంలో తలసేమియా సెంటర్లు ఏర్పాటు
- తలసేమియా వ్యాధిపై అవగాహనకు మే 10న హైదరాబాద్‌లో రన్
- మహిళలు ఆర్థికశక్తిగా ఎదగాలి: నారా భువనేశ్వరి
- కుప్పం నియోజకవర్గంలో ముగిసిన 4 రోజుల పర్యటన



కుప్పం (చైతన్య రథం): ఎన్టీఆర్ ఆశయ సాధనలో ముందుంటామని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఆపన్నులను ఆదుకునేందుకు ట్రస్ట్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా పలు గ్రామాల్లో భువనేశ్వరి పర్యటించారు. అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలతో సమావేశమయ్యారు. 4వ రోజు పర్యటనలో ముందుగా శ్రీరామ నవమిని పురస్కరించుకుని కుప్పంలో కోదండరామ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బాల్య స్నేహితుడు చంద్రశేఖర్ ఇంటికి భువనేశ్వరి వెళ్లారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త బాలకుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## పేదలకు అండగా ట్రస్ట్ సేవలు

ఎన్టీఆర్ స్ఫూర్తితో, సీఎం చంద్రబాబు సహకారంతో ట్రస్ట్ సేవలు కొనసాగిస్తున్నామని నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వయం ఉపాధికి చేయూత కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 29 సంవత్సరాలు పూర్తయింది. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటంవల్ల ట్రస్ట్ బాధ్యతలు నాకు అప్పగించారు. చంద్రబాబు అందించిన స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నాం. తలసేమియా వ్యాధిగ్రస్తులకు మావంతు సాయం అందిస్తున్నాం.

దాతలు కూడా మాకు సాయంగా నిలుస్తున్నారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కూడా తలసేమియా సెంటర్లు ప్రారంభిస్తాం. ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతిలో నాలుగు బ్లడ్ బ్యాంక్స్ నిర్వహిస్తున్నాం. త్వరలో విజయవాడలో ప్రారంభిస్తాం. తలసేమియా బాధితుల కోసం మే 10న హైదరాబాద్‌లో నిర్వహించే రన్‌లో అందరూ పాల్గొని వారికి ధైర్యం చెప్పాలని భువనేశ్వరి కోరారు.

## ట్రస్ట్‌ద్వారా విద్య, వైద్యం, ఉపాధి కల్పన

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపుల నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా 23 లక్షలమందికి సేవలు అందించాం. ఇందుకోసం రూ.23 కోట్లు ఖర్చు చేశాం. ఎన్టీఆర్ సంజీవని ద్వారా పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నాం. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం. ఏజెన్సీ ఏరియాల్లో హెల్త్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాం. హైదరాబాద్ గండిపేటలో ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్, డిగ్రీ కాలేజ్ ఉన్నాయి. ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్ ద్వారా గ్రామీణ నేపథ్యంనుంచి వచ్చే పిల్లలకు గణితం, ఆంగ్లంలో పట్టు సాధించేలా శిక్షణ అందిస్తున్నాం.

ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఇన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామంటే అందుకు దాతలు, మా సిబ్బంది సహకారమే కారణం. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన నాకు చంద్రబాబు హెరిటేజ్ బాధ్యతలు అప్పగించినప్పుడు ఏంచేయాలో, ఎలా మాట్లాడాలో కూడా తెలిసేది కాదు. ఏదైనా చేయగలను అని ధైర్యంగా అడుగు ముందుకు వేస్తే విజయం సాధించగలం. మహిళల ఆర్థక స్వావలంబన కోసం కుప్పంలో స్త్రీ శక్తి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశాం. ఇక్కడ శిక్షణ తీసుకున్న మహిళలు ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడుతున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళల ఉత్పత్తులు మార్కెటింగ్ కోసం హైదరాబాద్‌లో స్త్రీ శక్తి హస్తకళ స్టోర్ ఏర్పాటు చేశామని భువనేశ్వరి తెలిపారు. అనంతరం 40మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30మందికి తోపుడు బండ్లు, పలువురికి వినికిడి మిషన్లను భువనేశ్వరి అందజేశారు.
















# మా తరం చూడని తెలుగు దేశం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000వ సంవత్సరంలో పుట్టిన నేను పెరుగుతున్న క్రమంలో ఎన్నో మార్పులను చూసాను. కాలక్రమేణా ప్రజల జీవన గతులు మారడం, అలానే ఎంతోమంది తలరాతలు మారడం చూసాను. అప్పుడు నాలో అనేక ప్రశ్నలు ఉదయించాయి. ఆ ప్రశ్నలకు జవాబులు తెలుసుకునే సమయంలో తెలుగుదేశం గురించి తెలుసుకున్నాను. ఒక్క పార్టీ తలచుకుంటే ఒక్క జాతి తలరాత ఎలామారుతుందో, ప్రజల జీవన స్థితిగతులను ఎలా మార్చగలదో, భవిష్యత్తు తరాల కోసం పునాదులు ఎలావేయగలదో తెలుసుకున్నాను. అవి మా తరంలో ప్రతి ఒక్కరికి తెలియచేయడం కోసం, మా తరాన్ని చైతన్యపరచడం కోసం ఈ వ్యాసం రాస్తున్నాను.

## పేదలకు పట్టెడన్నం పెట్టిన పార్టీ తెలుగుదేశం

ఈ తెలుగునాట 1980వ దశకంలో గంజినీళ్లు, రాగులు, సజ్జలు మాత్రమే తిని బతికే ఎంతోమంది పేదల కోసం రెండు రూపాయల కిలో బియ్యం ఇచ్చి వారి ఆకలి తీర్చిన పార్టీ తెలుగుదేశం అని తెలుసుకున్నాను. పాత రోజుల్లో పూరి గుడిసెలు మాత్రమే వుండేటివి. ఎంతోమంది పేదవాళ్లు దాంట్లో ఉండేవాళ్లు ఎప్పుడు వానొచ్చినా, ఎండ వచ్చినా, గాలివచ్చిన నిద్రలేని రాత్రులుగడిపే వారు. అలాంటి నిరుపేదల కోసం పక్కా ఇళ్ళు నిర్మించి, వారిని ఒక ఇంటికి యజమానులను చేసిన పార్టీ తెలుగుదేశం అని తెలుసుకున్నాను.

## మహిళలకోసం యూనివర్సిటీ పెట్టిన పార్టీ

ఒకప్పుడు ఇంటి గడప దాటి బయటికి రాని మహిళల కోసం చదువుకోమని ఒక ప్రత్యేక విశ్వ విద్యాలయం పెట్టిన పార్టీ. మహిళలకు పాఠశాలలకు వెళ్లడానికి సైకిలు ఇచ్చిన పార్టీ. మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీలు పెట్టిన పార్టీ. ఉద్యోగాల్లో కాలేజీ సీట్లలో 33% రిజర్వేషన్లు కల్పించిన పార్టీ. బస్సుల్లో మహిళలకు కండక్టర్లుగా పరిచయం చేసిన పార్టీ. డ్వాక్రా సంఘాల ద్వారా వాళ్లలో చైతన్యం తీసుకువచ్చి వాళ్ళ సొంత కాళ్ళపైన వాళ్ళు నిలదొక్కుకునేలా చేసిన పార్టీ. ప్రతి ఆడబిడ్డ ఒక వ్యాపారవేత్త అయ్యేలా ప్రణాళికల రూపొందించిన పార్టీ. ఇలా మహిళాసాధికారత కోసం పనిచేసిన పార్టీ తెలుగుదేశం అని తెలుసు కున్నాను. ఒకప్పుడు ఆడబిడ్డ పుడితే పెళ్లి చేసి అత్తగారింటికి పంపిస్తే వాళ్ళ దయా, దాక్షిణ్యాల మీద బతికే పరిస్థితి నుంచి వాళ్లకు ఆస్తిలో సమాన హక్కు కల్పించాలని చట్టం చేసి సమాజంలో ఒక మార్పు తీసుకొచ్చిన పార్టీ తెలుగుదేశం అని తెలుసుకున్నాను.

## రైతన్నలకు అండగా నిలచిన పార్టీ

ఒకప్పుడు శిస్తు కట్టలేని రైతుల కోసం భూమిశిస్తు రద్దుచేసింది, కరెంటుచార్జీల భరించలేని రైతులకోసం 50 రూపాయలకే హార్స్ పవర్ విద్యుత్ తీసుకువచ్చింది. సాగుకి తాగుకి నీటికి సమస్య ఉంటే రాష్ట్రమంతటా ప్రభుత్వంతరఫున వేలబోర్లు వేయించి,రైతులకు అండగా నిలబడింది. ప్రతిఎకరాకు నీళ్లు అందించాలని లక్ష్యంతో ఈ తెలుగునాట ఇరిగేషన్ ప్రాజెక్టులకు పునాదులు వేసింది. మనం చూస్తున్న తెలుగు గంగా, హంద్రీనీవా, గాలేరు నగరి, సోమశిల, కందలేరు, పులిచింతల,మద్దువలస, జూరాల, నెట్టెంపాడు, కల్వకుర్తి లిఫ్ట్, బ్రహ్మంసాగర్,మచ్చుమరి ఎత్తిపోతల, సిద్దాపురం, అవుకు టన్నెల్, ఎస్ ఎల్ బి సి, ఎస్ ఆర్‌బిసి ఇలాంటి ఎన్నో ప్రాజెక్టుల ద్వారా జలధారలు పారించింది తెలుగుదేశం అని తెలుసుకున్నాను.

## రాయలసీమను రూపురేఖలు మార్చిన పార్టీ

కరువుతో అల్లాడుతున్న రాయలసీమలో నీళ్లు ఇవ్వడమే కాకుండా రైతులకు బిందు సేద్యం వైపు మళ్లించింది. ఇజ్రాయిల్ టెక్నాలజీ అయిన డ్రిప్ తీసుకొచ్చి 90% సబ్సిడీ ఇచ్చి రైతులకు అందించి ఈరోజు రాయలసీమ ఒక హార్టికల్చర్ హబ్‌గా మార్చింది తెలుగుదేశం అని తెలుసుకున్నాను. రాయలసీమ అంటే ఒకప్పుడు ఫ్యాక్షనిజం, గూండాయిజం, రౌడీయిజం అని వినేవాళ్ళం,ఆ పరిస్థితులను మార్చి ఫ్యాక్షనిజంని అణచివేసి, ముఠా కక్షలకు చెక్ పెట్టి ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పి, కత్తులు పట్టే చేతులకు పెన్నులు కంప్యూటర్లను పట్టించింది తెలుగుదేశం. రక్తం పారె దగ్గర నీళ్లను పారించింది, బాంబులు తయారయ్యే దగ్గర కార్లు, ఫోన్లు తయారయ్యాలా చేసింది. టెంపుల్ టూరిజంకి కేర్ ఆఫ్ అడ్రెస్సగా మార్చింది, చదువులకు నిలయంగా మార్చి రేపటి తిరుగులేని భవిష్యత్తుకు పునాదులు వేసిందని తెలుసుకున్నాను.



రేపు తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా...

## పాలనా వ్యవస్థను ప్రజలకు చేరువ చేసిన పార్టీ

ఒకప్పుడు మనకు ఏదైనా పనిబడి ప్రభుత్వం దగ్గరికి వెళ్లాలంటే తాలూకా వ్యవస్థలో వందల కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. అలాంటి సమయంలో తాలూకా వ్యవస్థని రద్దుచేసి పరిపాలన దగ్గర చేయడం కోసం మండల వ్యవస్థను తీసుకువచ్చిన పార్టీ. ఈ సేవ,మీసేవ వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చిన పార్టీ, రైతులకు వాళ్ళ భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం అని తెలుసుకున్నాను.

## తెలుగు నాట విద్యావిప్లవాన్ని తెచ్చిన పార్టీ

ఈరోజు మనమందరం చదువుకుంటున్నాం కానీ ఒకప్పుడు చదువు అనేది కొంతమందికి మాత్రమే పరిమితం. ఆ రోజుల్లో సమాజంలో మార్పు రావాలంటే చదువు వల్ల మాత్రమే సాధ్యమని చదువుల పండగ అనే పాలసీ తీసుకొచ్చి ఏడు లక్షల మంది విద్యార్థులకు బడికి వచ్చేలా చేసింది. ఒకప్పుడు 40% కూడా లేని అక్షరాస్యత 80% వరకు పెరిగేలా మార్పు తీసుకువచ్చింది. ఈ తెలుగు నాట, తొలిసారి రెసిడెన్షియల్ స్కూల్స్, రెసిడెన్షియల్ కాలేజీలు తీసుకొచ్చింది. ఎంసెట్ విధానాన్ని తీసుకొచ్చింది తెలుగు దేశమే, తొలి వైద్య విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం తీసుకొచ్చింది. కొత్తగా 38 వేల పాఠశాలల నిర్మించి, డీఎస్సీ ద్వారా రెండు లక్షల వరకు ఉపాధ్యాయులు నియమించింది. అందరూ చదవాలి, అందరూ ఎదగాలి అని ప్రతి గ్రామంలోకి ఒక ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల కి ఒక ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్లకి ఉన్నత పాఠశాలనెలకొల్పింది. కంప్యూటర్ విద్యను పాఠశాల స్థాయిలోనే తీసుకొచ్చారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, బి ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ, జూనియర్, డిగ్రీ, డైట్ కాలేజీలను ఏర్పాటుచేసి ఈ తెలుగు నాట విద్యా విప్లవాన్ని తీసుకొచ్చిన పార్టీ తెలుగుదేశం అని తెలుసుకున్నాను.

## ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం కల్పించిన పార్టీ

తెలుగుదేశం పార్టీ పెట్టడానికి ముందు ఈ సమాజంలో పటేల్ పట్వారి, కరణం, మున్సబు లాంటి ఫ్యూడల్ వ్యవస్థల చేతుల్లో ప్రజలు మగ్గిపోయేవారు. అలాంటి వ్యవస్థలను రద్దుచేసి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో కోట్లాది ప్రజలకు నిజమైన స్వాతంత్రాన్ని ఇచ్చిన పార్టీ తెలుగుదేశం. అలాగే ఒకప్పుడు సమాజంలో కుల వివక్షతతో ప్రజలు మగ్గిపోతూ ఉంటే ఆ సామాజిక దురాచారంపై రాజీలేని పోరాటం చేసి, సమాజంలో ప్రజలను చైతన్యపరచి, కుల వివక్షతను రూపుమాపిన పార్టీ తెలుగుదేశం. అన్ని వర్గాలకు అవకాశాలు రావాలని స్థానిక సంస్థల్లో బీసీలకు తొలిసారి 20% రిజర్వేషన్ తీసుకొచ్చింది, ఎస్సీలకు 14 నుంచి 15 శాతానికి, ఎస్టీలకు 4నుంచి 6శాతానికి తీసుకొచ్చింది, మైనారిటీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. దేశానికి తొలి దళిత స్పీకర్ను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు తొలి దళిత మహిళ స్పీకర్ను అందించింది. రెండు గ్లాసుల సిద్ధాంతాన్ని రూపుమాపి, వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకు సమఫలాలు అందాలని కృషి చేసింది తెలుగుదేశం అని తెలుసుకున్నాను.

## టీడీపీ ఆవిర్భావంతో విప్లవాత్మక మార్పులు

ఒకప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్, గోల్కొండ అనే పరిస్థితి నుండి యువతకు ఉపాధి చూపించే స్థాయివరకు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. హైటెక్ సిటీ, మైక్రోసాఫ్ట్, ఐఆర్డిఏ, ISB, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు, ఎంఎంటిఎస్ పరుగులు, 19 ఫ్లైఓవర్లు, మల్టీప్లెక్స్‌లు, అంతర్జాతీయ వ్యాపార సంస్థలు, బయోటెక్ సంస్థలు, గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం ,సరూర్ నగర్ స్టేడియం వంటి అనేక క్రీడా ప్రాంగణాలు నిర్మించి 2002లోని 32వ నేషనల్ గేమ్స్, 2003 లోని మొదటి ఆఫ్రో ఆసియన్ గేమ్స్ వంటి నిర్వహించి క్రీడా రాజధానిగా చేశారు. బిల్ గేట్స్, బిల్ క్లింటన్, టోనీ ప్లేయర్ వంటి ప్రపంచ ప్రఖ్యాతలను హైదరాబాద్ రప్పించి ప్రపంచ పటంపై హైదరాబాదును గుర్తింపు తెచ్చారు. IIIT, నల్సార్‌ను హైదరాబాద్‌కు తెచ్చింది. నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ గార్డెన్స్, జలగం వెంగళరావు పార్క్,కేబిఆర్ పార్క్, కృష్ణకాంత్ పార్క్, సంజీవయ్య పార్క్,జలవిహార్ వంటివి ఈరోజు ప్రజలకుఆహ్లాదాన్ని పంచుతున్నాయంటే అది తెలుగు దేశం ఫలితమే. హైదరాబాద్ త్రాగునీటి కోసం నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలు తీసు కొచ్చింది తెలుగుదేశమే. ఈరోజు మనంచూస్తున్న హైదరాబాద్ అభివృద్ధికి 1990లోనే పునాదులు వేసి హైదరాబాద్ తలరాతను మార్చింది తెలుగుదేశం అని తెలుసుకున్నాను.

## విలువలకు ప్రాధాన్యతనిచ్చే పార్టీ తెలుగుదేశం

మనం నేడు చూస్తున్న రాజకీయ పార్టీలకు తెలుగుదేశానికి చాలా వ్యత్యాసం ఉంది. ఎందుకంటే తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రత్యర్థి పార్టీలను చంపాలని గాని, కూలగొట్టాలని గాని, పడగొట్టాలని కానీ చూడలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తి తెలుగుజాతి ఆత్మ గౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం. అలాంటిది కాంగ్రెస్ పార్టీ నుంచి పీవీ నరసింహారావుగారు ప్రధాని అభ్యర్థిగా నంద్యాల నుంచి పోటీ చేస్తే నా తెలుగువాడు ప్రధాని అవ్వాలని అభ్యర్థని నిలబెట్టకుండా పార్టీలకతీతంగా విలువలతో రాజకీయం చేసింది తెలుగుదేశం. అలానే తెలుగు దేశం పార్టీ చేసిన ఎన్నో పనులకు ప్రత్యర్థి పార్టీలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తుల పేర్లు కూడా పెట్టి విలువలతో రాజకీయం చేసింది. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే సమయంలో ఎన్నో పదవులు వచ్చిన తీసుకోకుండా రాష్ట్ర హక్కుల కోసం, దేశ ప్రయోజనాల కోసం పనిచేసిన పార్టీ తెలుగుదేశం. సొంత పార్టీ కార్యకర్తలను ప్రత్యర్థులు చంపితే కత్తి ఇచ్చి కార్యకర్తలను ప్రత్యర్థులను చంపమని చెప్పలేదు. దీనికి చెక్ పెట్టి వాళ్ళ పిల్లలను చదివిపించి సమాజంలో వాళ్ల పిల్లలను ప్రయోజకులను చేసి ఉన్నత స్థాయిలో కూర్చోబెట్టింది. ఇలా నిరంతరం విలువలతో, సిద్ధాంతాలతో పనిచేసిన పార్టీ తెలుగు దేశం అని తెలుసుకున్నాను.

## తెలుగుదేశం ఘనచరిత్ర గురించి తెలుసుకోవాలి

ఇలా మనం సమాజంలో చూస్తున్న అన్ని వర్గాల, అన్ని వృత్తుల, అన్ని ప్రాంతాల, అభివృద్ధిలో భాగస్వామ్యం అయింది తెలుగుదేశం. అలానే భవిష్యత్తుకు పునాదులు వేస్తూ నేడు క్వాంటం వ్యాలీ అంటూ, డేటా సెంటర్లకు నిలయంగా మార్చింది. గ్రీన్ ఎనర్జీకి నిలయంగా, ఆర్గానిక్ ఫార్మింగ్ అంటూ కొత్త విధానాలతో, విజన్ 2047 అంటూ మన భవిష్యత్ తరాల కోసం పనిచేస్తుంది తెలుగుదేశం.అందుకే ప్రతిఒక్కరు ఈతరం యువతగా మనపాతతరాల్లో మార్పులు తీసుకొచ్చిన తెలుగుదేశం గురించి తెలుసుకోవాలి. భవిష్యత్తులో మన కోసం మన రేపటి తరాల కోసం పని చేస్తున్న తెలుగుదేశంకు మన వంతు కర్తవ్యంగా అండగా నిలబడుతూ, మంచి సమాజాన్ని నిర్మించడంలో రేపటి విజయాలను సాధించడంలో మనమందరం భాగస్వామి అవ్వాలని కోరుకుంటూ...

దుత్తలూరు శశికుమార్,
తెలుగుదేశం సైనికుడు



# కొత్త వడ్డెర సొసైటీలకు గ్రీన్ సిగ్నల్

- మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం
- వడ్డెర్లకు ఎన్నికల హామీలు నెరవేర్చిన మంత్రి లోకేశ్
- వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం లక్ష్యం
- ప్రకటించిన రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత
- మంత్రి సవితకు సత్కారం..
  చంద్రబాబు, పవన్, లోకేశ్ పటాలకు పాలాభిషేకం



తాడేపల్లి/ అమరావతి (చైతన్య రథం): తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీమేరకు వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం కేటాయించనున్నామని, మినరల్ లీజులో 50 శాతం మినహాయింపు ఇవ్వనున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెర్లందరికీ ఆర్థికంగా మేలు కలిగేలా కొత్త వడ్డెర్ల సొసైటీలు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వడ్డెర కార్పొరేషన్ మల్లె ఈశ్వరరావు ఆధ్వర్యంలో వడ్డెర సామాజిక వర్గీయులు శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. తమకు ఆర్థిక భరోసా కలిగించేలా మైనింగ్ లీజులు కేటాయింపులతో పాటు సినరేజీ మినహాయింపు ఇచ్చినందుకు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికలముందు బీసీలకు ఇచ్చిన ప్రతి హామీనీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయించామన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేలనుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. మత్స్యకారులకు నష్టం కలిగిస్తున్న వివాదాస్పద 217 జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. చేనేతలకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ అమలు చేయబోతున్నామన్నారు. నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో నడిచే సెలూన్లకు ఉచిత విద్యుత్ ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచామన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచామన్నారు. బడ్జెట్ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, రూ.51 వేల కోట్లకు పైగా వారి అభ్యున్నతికి కేటాయించామన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిధులు గతంలో ఎప్పుడూ కేటాయించలేదని మంత్రి సవిత గుర్తు చేశారు.

**నూతన వడ్డెర సొసైటీల ఏర్పాటుకు ఓకే**

వడ్డెర్లకు ఆర్థిక, సామాజిక గుర్తింపు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో వడ్డెర్ల కష్టాలను మంత్రి నారా లోకేశ్ స్వయంగా చూశారన్నారు. ఆనాడే వారి సంక్షేమానికి, ఆర్థిక ఉన్నతికి పలు హామీలిచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మైనింగ్ లీజుల్లో వడ్డెర సొసైటీలకు 15 శాతం కేటాయింపు, సినరేజీలో 50 శాతం మినహాయింపు ఇస్తూ మంత్రిమండలి సమావేశంలో తీర్మానం చేశామన్నారు. వడ్డెర స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం శాశ్వత జీవో తీసుకొచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమన్నారు. వడ్డెర్లను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

**చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం**

అంతకుముందు మంత్రి సవితను కలిసి వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు, డైరెక్టర్లు, ఆ సామాజిక వర్గీయులు ఘనంగా సత్కరించారు. ఆర్థిక భరోసా కలిగించేలా మైనింగ్ లీజులు కేటాయింపులతోపాటు సినరేజీ మినహాయింపు ఇచ్చినందుకు ఆనందం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మంత్రి సమక్షంలో చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, డైరెక్టర్లు దుర్గారావు, దుర్గా మహాలక్ష్మి, వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన వడ్డెర సామాజిక ప్రతినిధులు కుంచాల సావిత్రి, మణికుమారి, శ్రీరామ్, ఉప్పు శ్రీను, వేముల బాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తెస్తాం: మంత్రి కందుల

*ప్రపంచ రంగస్థల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సినిమాటోగ్రఫీ మంత్రి*



అమరావతి (చైతన్య రథం): ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలుగు నాటకరంగ లోకానికి, కళాకారులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రకటన విడుదల చేస్తూ నాటక రంగాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలుగు నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తోందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విస్మరించిన ప్రతిష్ఠాత్మక 'కందుకూరి వీరేశలింగం పంతులు' పురస్కారాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని, ఏప్రిల్ 16న తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా ఒక పర్యాయం అర్హులైన కళాకారులకు, రచయితలకు, సాంకేతిక నిపుణులకు అందజేసిందని గుర్తుచేశారు. త్వరలోనే మరో దఫా కందుకూరి పురస్కారాలు అందిస్తామని స్పష్టం చేశారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆ దిశగా కసరత్తు మొదలైందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, స్వయంగా కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కళలకు, కళాకారులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నాటకం అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది సామాజిక మార్పునకు శక్తివంతమైన ఉత్ప్రేరకమని అభివర్ణించారు. భూత, భవిష్యత్, వర్తమానాలకు వారధిగా నిలిచే ఏకైక కళారూపం నాటకమని కొనియాడారు. రంగస్థల నటుడిగా ఇటీవల తాను ప్రదర్శించిన బాలచంద్రుడు, వీరపాండ్య కట్టబొమ్మన ఏకపాత్రాభినయ పాత్రలను మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ, నవరసాలను పండించే నాటక కళపట్ల తనకున్న మక్కువను చాటుకున్నారు. ప్రతిభగల కళాకారులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు. సాంప్రదాయ నాటక కళకు ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా నేటి తరానికి నచ్చేలా నాటకాలను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉన్న కళాక్షేత్రాలను, ఆడిటోరియంలను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించాలని భావిస్తున్నామని, తద్వారా కళాకారులకు మెరుగైన వేదికలు, ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాటక పరిషత్తులను ప్రోత్సహించడం ద్వారా మరుగున పడిపోతున్న పౌరాణిక, చారిత్రక, జానపద నాటకాలను, కళారూపాలను పునరుద్ధరించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నాటకం అనేది సమాజానికి అద్దం పట్టే కళ అని పేర్కొంటూ వరల్డ్ థియేటర్ డే సందర్భంగా ఈ కళాకారుల ప్రతిభను గుర్తించి, వారిని ఆర్థికంగా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.



## పీఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతం చేయాలి

- అంబేద్కర్ జయంతికి ప్రతీ సెగ్మెంట్‌లో 2 వేల కనెక్షన్లు
- వచ్చే సీజన్‌కు పెండింగ్ కనెక్షన్లు మంజూరు
- ఇంధన ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్

*అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో విద్యుత్ శాఖ పరిధిలో అమలవుతున్న పనులను వేగవంతం చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి డిస్కంల సీఎండీలు, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్, పీఎం కుసుమ్ పథకాల పురోగతిని సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా అందిస్తున్న పీఎం సూర్యఘర్ సోలార్ కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి, బాబు జగజీవన్ రామ్ జయంతినుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వరకు ప్రతి నియోజకవర్గంలో కనీసం 2వేల కనెక్షన్లు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులో లక్ష్య సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లన్నింటినీ వచ్చే సీజన్‌కు ముందే మంజూరు చేయాలని సూచించింది. రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రజలపై అదనపు భారం లేకుండా విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం భరిస్తుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేసి పథకాల అమలులో వేగం పెంచాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.*

## వడగాల్పులతో జాగ్రత్త!

**ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు గరిష్టమవుతున్నాయని, వడగాల్పులు వీచేచోట ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శ్రీకాకుళం జిల్లా బూర్జ, విజయనగరం జిల్లా బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, గుర్ల, మెరకముడిదం, రాజాం, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి, తెర్లాం, వంగర మండలాలు, పార్వతీపురంమన్యం జిల్లా బలిజిపేట, గరుగుబిల్లి, పాలకొండ, సాలూరు, సీతానగరం మండలాల్లో తీవ్ర వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. రాయలసీమ జిల్లాల్లో 40–42డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందన్నారు. ఆదివారం 18 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 29 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా గుల్లదుర్తిలో అత్యధికంగా 42.1డిగ్రీల సెల్సియస్, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో అత్యల్పంగా 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. చెవుల్లోకి వేడి గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు.

# విద్యార్థుల కోసం ప్రత్యేక డిజిటల్ హెల్త్ పోర్టల్

- ఈ-లెర్నింగ్‌తో నేర్చుకోవడానికి వీలుగా..
- సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా చర్యలు
- వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఏపీఎస్‌హెచ్‌డబ్ల్యూపీ పేరిట పోర్టల్ రూపకల్పన




అమరావతి (చైతన్య రథం): విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ చర్యల్లో భాగంగా ఆన్‌లైన్ వేదికగా కూటమి ప్రభుత్వం కొత్త ఒరవడి సృష్టించింది. దేశంలోనే తొలిసారిగా 13-19 ఏళ్ల మధ్య ఉన్న కౌమార విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'ఆంధ్రప్రదేశ్ స్కూలు హెల్త్‌వెల్నెస్ ప్రోగ్రాం' కింద డిజిటల్ పోర్టల్‌ను రూపొందించింది. వైద్య సేవల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న ప్రభుత్వం తాజాగా ప్రివెన్షన్ విధానంలో విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యం, వ్యసనాల దుష్ప్రభావాలు మానసిక ఉల్లాసం, మంచి పద్ధతుల తెలుసుకునేలా అత్యాధునిక సాంకేతి పరిజ్ఞానంతో కొత్త పోర్టల్‌ను సిద్ధం చేసింది. బాలబాలికలు ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండడం, లింగ సమానత్వం, హెచ్‌ఐవీ, రోడ్డు ప్రమాదాల బారినపడకుండా ఉండడశీ ఇంటర్నెటు, సామాజిక మాధ్యమాల సురక్షిత వినియోగం వంటి అంశాలపై స్వీయ విధానం (సెల్ఫ్ లెర్నింగ్)లో నేర్చుకునేలా 'ఏపీఎస్ హెచ్ డబ్ల్యూపీ' కొత్త పోర్టలును అందుబాటులోనికి తెచ్చామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్ర కిశోర ఆరోగ్య కార్యక్రమంలి కింద 'డిజిటల్ లెర్నింగ్ మేనేజ్మెంటు సిస్టమ్' కింద రూపొందించిన ఈ పోర్టల్ ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించేలా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ ఇంటర్ కళాశాలల్లో పనిచేస్తే ఉపాధ్యాయులు, లెక్చరర్లలో ఎంపిక చేసిన వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇచ్చిన శిక్షణకు కొనసాగింపుగా ప్రతి జిల్లాలో 150 మంది ఉపాధ్యాయులు, లెకర్చర్లకు చొప్పున శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సీఎం శ్రీ చంద్రబాబు ఆలోచనల నుంచి ఈ పోర్టల్ ఉద్భవించిందని మంత్రి శ్రీ సత్యకుమార్ నేడొక ప్రకటలో వివరించారు.

**విశ్వసనీయ, శాస్త్రీయ సమాచారంతో తయారైన పోర్టల్**

సాధారణంగా విద్యార్థులు టీచర్ల ద్వారా లేదా టీవీలు, మీడియా, సామాజిక మాధ్యమాల వేదికగా వారికి అవసరమైన సమాచారంపై అవగాహన పొందుతున్నారు. ఈ క్రమంలో రకరకాల కారణాలవల్ల విశ్వసనీయత లేని సమాచారంతో తప్పుదోవపడుతున్నారు. ఈ ధోరణికి చెకపెట్టాలన్న ఉద్దేశంతో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్దిష్ట విశ్వసనీయ, శాస్త్రీయ సమాచారాన్ని పోర్టలు ద్వారా అందుబాటులోనికి తెచ్చామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు.

**ఆకర్షణీయ ఫీచర్లు:**

ఈ పోర్టలులో విద్యార్థులందరికీ ఉపయోగపడే విధంగా 11 ప్రధాన అంశాల సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యం, మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత సంబంధాలు ఎలా ఉండాలి? నైతిక విలువలు-ప్రాధాన్యం, పౌష్టికాహారం ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, ఇతర అంశాల గురించి 15 నిమిషాలలోపు ఉండేలా వీడియోలను తెలుగు, ఆంగ్ల భాషల్లో పోర్టలులో ఉంచారు విద్యార్థులు పరస్పరం మాట్లాడుకుంటే ఎలా ఉంటుందో అలా వివిధ అంశాలపై వీడియో పాఠాలను రూపొందించారు. ఉదాహరణకు బాలికల రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, మత్తు పదార్థాల వాడకంతో వచ్చే ఆరోగ్య క్షీణత గురించి వీడియో పాఠాల్లో పేర్కొన్నారు. అలాగే... మితిమీరిపోతున్న సోషల్ మీడియా ప్రభావంవల్ల ఎటువంటి కష్టాలు, నష్టాలు ఎదురవుతాయో తెలిపే విధంగా వీడియో పాఠాలు పోర్టలులో ఉన్నాయి. ఆటల రూపంలో ఈ-లెర్నింగ్, క్విజ్ పోటీల్లో పాల్గొనడం, ఆన్లైన్ పరీక్షలు రాసిన వారికి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సర్టిఫికెట్ల జారీ జరుగుతుంది.

**37,297 మంది రిజిస్ట్రేషన్!**

విద్యార్థులు రిజిస్ట్రేషన్ విధానంలో పోర్టలులోని సమాచారాన్ని తెలుసుకునే సౌకర్యాన్ని వైద్య ఆరోగ్య శాఖ కల్పించింది. తాజా సమాచారం ప్రకారం..36,297 మశీది విద్యార్థులు పోర్టలు ద్వారా కొత్త విషయాలు తెలుసుకున్నారు. వీరిలో 75% మంది బాలికలు ఉండడం గమనార్హం పోర్టల్ నుంచి ప్రతి ఈ-మాడ్యుల్ నుంచి ప్రశ్న-జవాబు రూపంలో క్విజ్, ఇందులో పాల్గొన్న వారిలో 80% మార్కులు వచ్చిన వారికి ప్రతిభ ఆధారిత సర్టిఫికెట్లు ఆటోమేటిగ్గా జారీ అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది పేరు, సెల్ఫోన్ నెంబరు, మెయిల్ ఐడీ ఇస్తే లాగిన్ అయ్యేవిధంగా పోర్టలులో వీలుకల్పించారు.

**ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం**

ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పానికి తగ్గట్లు బాలబాలికలే నేరుగా దైనందిన జీవన విధానంలో అన్ని వివరాలు తెలుసుకునేలా ఏపీఎస్‌హెచ్‌డబ్ల్యూపీ పోర్టలును వైద్య ఆరోగ్య శాఖ తయారుచేసింది. రాష్ట్రీయ కిషోర్ స్వాస కార్యక్రమం, ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ, యూనిసెఫ్, విద్యా శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఎయిమ్స్ మంగళగిరి భాగస్వామ్యంతో సమగ్ర డిజిటల్ వేదిక తయారైంది ఇందులో ప్రతి సమాచారం చట్టాలు, ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా శాస్త్రీయ సమాచారాన్ని పోర్టలు ద్వారా అందుబాటులోనికి వైద్య ఆరోగ్య శాఖ తెచ్చింది. ఈ పోర్టల్ లోనే చైల్డ్ హెల్ప్ లైన్, టెలీ మానస్ హెల్ప్ లైన్, ఇతర హెల్ప్ లైన్ల సమాచారం కూడా ఉంది



## చికిత్స పొందుతున్న బాధితులకు మంత్రుల పరామర్శ

ఒంగోలు (చైతన్య రథం): ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మార్కాపురం బస్సు ప్రమాద క్షతగాత్రులను శుక్రవారం మంత్రులు డిఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలగురించి డాక్టర్లను, బాధితుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "బస్సు ప్రమాద ఘటన దురదృష్టకరమని, ఘటన జరిగిన వెంటనే అధికార యంత్రాంగం స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు' అని వివరించారు. మంత్రుల బృందం వెంటనే ఘటనా స్థలికి చేరుకుని బాధితులను పరామర్శించిందన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని, ఘటనపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్రం రూ.2 లక్షలు పరిహారం ప్రకటించినట్టు వివరించారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు బాలవీరాంజనేయ స్వామి, రవికుమార్‌లు ధైర్యం చెప్పారు.



## ఆ భారం ప్రభుత్వంపైనే..!

- రూ.18 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం సర్కారు భరిస్తుంది
- సూపర్ 6తోపాటు రెండేళ్లలో విద్యుత్ భారాలు లేకుండా చేశాం
- కూటమి చేస్తున్న మంచి పనుల క్రెడిట్ కోసం జగన్ తాపత్రయం
- అద్దంకిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి గొట్టిపాటి




అద్దంకి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా తామే చేశామని చెప్పుకోవడం జగన్‌మోహన్ రెడ్డి క్రెడిట్ చోరీకి నిదర్శనమని రాష్ట్ర ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. అద్దంకిలో శుక్రవారం పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా జే పంగలూరు మండలం రామకూరు గ్రామంలో పర్యటించిన ఆయన స్వర్గీయ ఎన్టీ రామారావుతోపాటు టీడీపీ సీనియర్ నేత కీ.శే. గోకనకొండ రామలింగ స్వామి విగ్రహాలను ఆవిష్కరించారు. అక్కడే దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిల్డ్రన్స్ పార్క్‌ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రూ.31 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైన్లను ప్రారంభించారు. అదే గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహ్మద్ వలి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును మంత్రి అందజేశారు. కొరిశపాడు మండలం కుర్రావానిపాలెం పర్యటనలో భాగంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ రూ.3.85 కోట్లతో ఏర్పాటు చేయబోయే రక్షిత తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. కుర్రావానిపాలెం నుంచి తక్కెళ్లపాడు వరకు రూ.40 లక్షలతో నిర్మించిన తారురోడ్డుతో పాటు, కుర్రావానిపాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైన్లను ప్రారంభించారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు ఏం నష్టపోయారు, కూటమి ప్రభుత్వంలో ఏం లబ్ధి పొందారో వారికి తెలుసని అన్నారు. పేదల పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచడానికి జగన్‌కు ఐదేళ్లు పట్టిందని విమర్శించారు. ఒకే సంతకంతో సంక్షేమ పెన్షన్‌ను వెయ్యి రూపాయలు పెంచడమే కాకుండా 'సూపర్ 6'ను కూడా సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు.

రెండేళ్లలో ఒక్క రూపాయి విద్యుత్ చార్జీ కూడా పెంచకుండా 13 పైసలు ట్రూ డౌన్ చేశామని తెలిపారు. ఏపీ ఈఆర్సీ ఆదేశాల ప్రకారం ప్రజల నుంచి వసూలు చేయాల్సిన సుమారు రూ.18 వేల కోట్ల భారాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. కూటమి చేసిన ప్రతి మంచి పనినీ తామే చేశామని చెప్పుకోవడం జగన్‌కు అలవాటుగా మారిందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ నేనే తెచ్చానని, కియా ప్లాంట్ మా నాన్న తెచ్చాడంటున్న జగన్, స్వాతంత్ర్యం కూడా మా తాతే తెచ్చాడని చెబుతాడంటూ ఎద్దేవా చేశారు. కూటమి చేస్తున్న అభివృద్ధిని మేమే చేస్తున్నామని గుండెలపై చేయి వేసుకుని ధైర్యంగా చెబుతామని అన్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఏడు సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు అనేక ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే సంక్షేమం, అభివృద్ధితో మంచి జరుగుతుందో గమనించాలని కోరారు.

అద్దంకి నియోజకవర్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న సైకిళ్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. జే. పంగలూరు మండలం రామకూరు పాఠశాలకు చెందిన 115 మందికి, కొరిశపాడు మండలం పి. గుడిపాడు పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పదివేలకు పైగా సైకిళ్లను విద్యార్థులకు ఉచితంగా అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు పూర్తి స్థాయిలో సైకిళ్లను అందించామని తెలిపారు. మిగిలిన విద్యార్థులకు కూడా ఏప్రిల్ నెలలో పరీక్షలు పూర్తయ్యే సమయానికి సైకిళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్యాలెస్ పెద్దల డైరెక్షన్‌లోనే

# వైసీపీ విష ప్రచారం

- దుర్ఘటనకర సంఘటనలపైనా రాజకీయమా?
- వైకాపా 'సైకో' మనస్తత్వానికి ఇదే నిదర్శనం
- క్షతగాత్రులకు వైద్య సౌకర్యాలపై సాక్షి మీడియా విష ప్రచారం
- తప్పుడు ప్రచారాలతో అడ్డంగా దొరికినా.. బుద్ధి లేదు
- ధైర్యముంటే.. అమరావతిపై అసెంబ్లీలో చర్చకు రండి
- వైఖరి మారకుంటే.. వైకాపాలు చరిత్రహీనులవుతారు
- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధ్వజం



మంగళగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో ఎక్కడైనా దుర్ఘటనకర సంఘటనలు జరిగితే, సహాయం చేయడం మానేసి 'గోతికాడ గుంటనక్కల్లా' ఎదురు చూడటం వైకాపా నేతలకు అలవాటుగా మారిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న రాయవరం సమీపంలో జరిగిన భీకర బస్సు ప్రమాదంలో 14మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఇలాంటి సమయంలో బాధితులకు అండగా ఉండాల్సింది పోయి, ప్రభుత్వంపై బురదజల్లడమే ధ్యేయంగా ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం, అంబులెన్స్ సిబ్బంది వేగంగా స్పందించారు. తెల్లవారుజామున 5:59 గంటలకు మొదటి కాల్‌రాగా, 10 నిమిషాల్లోనే మొదటి అంబులెన్సు ప్రమాద స్థలికి చేరింది. 24 నిమిషాల్లో రెండో అంబులెన్సు, 29 నిమిషాల్లో మూడో అంబు లెన్సు చేరాయి. మొత్తం 24మంది క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి, సురక్షితంగా మార్కాపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైకాపా హయాంలో కేవలం 470 అంబులెన్సులు మాత్రమే అందుబాటులో ఉంటే, ఈరోజు చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం 768 అంబులెన్సుల ను ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంచింది. ఇంత వేగంగా సేవలు అందుతుంటే, అంబులెన్సులు రాలేదని, వైద్యం అందలేదని ట్రోల్స్ చేయడం మీ వికృత మనస్తత్వానికి నిదర్శనం కాదా?" అని జగన్మోహన్ రెడ్డిని నిలదీశారు. ప్రమాదం జరిగినప్పుడు కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా స్పందించి ప్రాణాలు కాపాడాలని ప్రతి ఒక్కరూ తాపత్రయ పడతారని, కానీ వైకాపా మాత్రం ప్రతి చావులోనూ రాజకీయం వెతుక్కోవడం సిగ్గుచేటని విమర్శించారు. అబద్ధపు వార్తలతో ప్రజలను అయోమయానికి గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం వైకాపా దిగజారుడుతనానికి పరాకాష్ట" అని హితవు పలికారు.

ఎదుటివాడు బాధపడుతుంటే చూసి ఆనందించే వారిని ఏమంటాం? కచ్చితంగా సైకోలంటాం.వైకాపా నాయకులది కూడా సరిగ్గా అదే మనస్తత్వమని తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాయవరం బస్సు ప్రమాదంపై ఆ పార్టీ సాగిస్తున్న అబద్ధపు ప్రచారాన్ని తూర్పారబట్టారు. పోయినేడాది అక్టోబరులో కర్నూలు దగ్గర కావేరి బస్సు ప్రమాదం జరిగి 19మంది చనిపోతే, అప్పుడు కూడా ఇలాగే నీచ రాజకీయం చేశారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి బెల్ట్ షాపులో మద్యం తాగాడని అబద్ధాలు ప్రచారం చేశారు. కానీ, అతను అధికారిక షాపులోనే మద్యం కొన్నాడని మేము వీడియో ఆధారాలతో నిరూపించేసరికి వైకాపా నోళ్లు మూతపడ్డాయి. రాయవరం ప్రమాదం విషయంలో కాల్ డేటా ఉంది. అంబులెన్సులు ఎంత వేగంగా వచ్చాయో నిమిషాలతో సహా లెక్కలు ఉన్నాయి. ఏ అంబులెన్సులో ఎంతమందికి ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడారో స్పష్టంగా తెలుస్తోంది. ఇన్ని ఆధారాలున్నా, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేయడం మీకే చెల్లింది. వైకాపా ఒక రాజకీయ పార్టీలా కాకుండా, అరాచకవాదుల గుంపులా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. "సాక్షి పేపర్ గానీ, వారి మీడియాగానీ కించిత్తు నిజం లేకుండా అవాస్తవాలను వండి వారుస్తున్నాయి. ప్రభుత్వంపై బురద జల్లడమే ధ్యేయంగా పెట్టుకున్న ఈ 'విష ప్రచారకుల' విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బాధ్యత గల ప్రతిపక్షంగా ఉండాల్సింది పోయి, ఇంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం ఈ రాష్ట్రానికి శ్రేయస్కరం కాదని హెచ్చరించారు. రాష్ట్రానికి వైకాపా ఎంత ప్రమాదకర మో ప్రజలు అర్థం చేసుకున్నారు కాబట్టే గత ఎన్నికల్లో ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారు. అయినా జగన్మోహన్ రెడ్డికి, ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదు. ఇప్పటికీ అదే అబద్ధపు ప్రచారాలు, అదే కుట్రలతో కాలం వెళ్లదీస్తున్నారని నిప్పులు చెరిగారు. అమరావతి రాజధాని విషయంలో వైకాపా రెండు నాలుకల ధోరణి ప్రదర్శిస్తుంది అన్నారు. రేపు అసెంబ్లీలో అమరావతిపై కీలకమైన చర్చ జరగబోతోంది.

నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే, అమరావతిపై ప్రేమ ఉంటే.. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనండి. బయట ఉండి రౌడీల్లా రాళ్లు వేయడం, అబద్ధాలు చెప్పడం మానుకోండి. వైకాపా ఎమ్మెల్యేలారా.. మీకు ఇది ఒక మంచి అవకాశం. అసెంబ్లీకి రండి, మీ అభ్యంతరాలు ఏవైనా ఉంటే చెప్పండి, ప్రభుత్వం వాటిని నివృత్తి చేస్తుంది. అమరావతి నిర్మాణంలో మేమూ భాగస్వాములమే అని రాష్ట్ర ప్రజలకు ఒక మంచి సంకేతం పంపండి.

మీ నాయకుడు జగన్మోహన్ రెడ్డిని కూడా అసెంబ్లీకి తీసుకురండి. ఒకవేళ ఈ చర్చకు రాకుండా, రాజధానికి మద్దతు ఇవ్వకుండా పారిపోతే.. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో జగన్ రెడ్డి, వైకాపా ఎమ్మెల్యేలు 'చరిత్ర హీనులుగా' మిగిలిపోతారని హెచ్చరిస్తున్నాను. రాయవరం బస్సు ప్రమాదంపై వైకాపా చేస్తున్న విష ప్రచారాన్ని ప్రస్తావిస్తూ.. ప్రమాదం జరిగితే చాలు, దాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలనే నీచమైన యావ వైకాపాది. ప్రభుత్వం ప్రతి విషయాన్ని వాస్తవాలతో సహా ప్రజల ముందు ఉంచుతోంది. ఇలాంటి దుష్ట పార్టీని రాష్ట్రం నుంచి వెలివేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

# సజ్జల సుద్దులు హాస్యాస్పదం!

రాజధాని అమరావతికి వైసీపీ వ్యతిరేకం కాదని, వైసీపీ ప్రభుత్వ వికేంద్రీకరణ విధానంలో అమరావతికి రాజధానిగా స్థానముందంటూ వైసీపీ సజ్జల సుద్దులు చెప్పడం హాస్యాస్పదం. ఐదేళ్ల పాలనలో రాజధాని అమరావతికి మరణ శాసనం రాసి.. రైతుల రక్తం కళ్లజూసి.. రాజధాని లేకుండా రాష్ట్రాన్ని అనాథగా మార్చిన వారు -ఇప్పుడు రాజధానిపై అసెంబ్లీ తీర్మానాన్ని డ్రామా అంటూ విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించడమే. గత ప్రభుత్వంలో అమరావతి ప్రధాన విధ్వంస సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతున్న మాటలు వింటుంటే -ప్రజల జ్ఞాపకశక్తిపై ఆయనకెంత చులకన భావమో అర్థమవుతోంది. రాజధానిని అడ్డుకున్న రాక్షస రాజకీయం ఎవరిది? అసలు అసెంబ్లీలో అమరావతిపై మళ్లీ తీర్మానం చేయాల్సిన కర్మ దేశంలో ఏ రాష్ట్రానికి లేనిది ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే ఎందుకు పట్టింది? 2014లో సర్వసమ్మతమైన రాజధానిగా అంగీకరించిన అమరావతిని, 2019లో అధికార గర్వంతో మూడు ముక్కలు చెయ్యాలని ప్రయత్నం చేసింది ఎవరు? మూడు రాజధానులంటూ ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని గందరగోళంలో నెట్టిందెవరు? ఆనాడు అసెంబ్లీ సాక్షిగా మీరు ఆడిన మూడు ముక్కలాట డ్రామా కాదా? నాలుగున్నరేళ్లపాటు రోడ్లపై ఏడ్చిన రైతుల కన్నీళ్లు, పోలీసుల లాఠీ దెబ్బలు, అక్రమ కేసులు.. ఇవన్నీ మీ పాలనలో జరిగిన వాస్తవాలు కావా? ఒక రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే రాజధాని అంశాన్ని రాజకీయ ప్రయోగాల బలిపీఠంపైకి నెట్టినవారు ఇప్పుడు అదే రాజధానిని తిరిగి నిలబెట్టేందుకు తీసుకున్న అసెంబ్లీ తీర్మానాన్ని డ్రామాగా వర్ణించడం రాక్షస రాజకీయానికి నిదర్శనం కాదా?

అమరావతికి వ్యతిరేకిని కానని నమ్మించి అధికారంలోకి వచ్చి.. అమరావతిని పాడుబెట్టి ఐదు కోట్ల ఆంధ్రుల ఉసురు తీసిందెవరు? గత ఐదేళ్లలో అమరావతిలో ఒక్క ఇటుక పెట్టనివారు, ఉన్న భవనాలను శిథిలావస్థకు చేర్చిన వారు, అమరావతిలో రోడ్లను సైతం తవ్వించినవారు.. రాజధాని అభివృద్ధిపై నీతులు చెప్పడమేంటి? అమరావతిలో ఏముంది? ఆ భవనాలన్నీ గ్రాఫిక్సేనని, అది ఒక ఎడారి, శ్మశానమని, ముంపు ప్రాంతమని, ఇన్‌సైడ్ ట్రేడింగ్ అని.. ఇలా నానా విధాలా తూలనాడి అమరావతి రెక్కలు విరిచారు. సొంత మీడియాలో అమరావతిని వేశ్యల రాజధానిగా వర్ణించారు. అమరావతి నిర్మాణానికి రుణమిచ్చేందుకు ముందుకొచ్చిన సంస్థలకు అడ్డుపడ్డారు. రాజధాని నిర్మాణంలో పాలు పంచుకోవద్దంటూ సింగపూర్ ప్రతినిధులకు లేఖలు రాసారు. సింగపూర్ ప్రభుత్వాన్నే బెదిరించింది మీరు కాదా? వీటికి సమాధానం చెప్పగలరా సజ్జలా? అధికారంలో వున్నప్పుడు క్యాబినెట్ పెట్టుకోవడానికి తప్ప సచివాలయం ముఖం చూడటానికి కూడా ఇష్టపడని మీరు.. ఇప్పుడు రాజధానిపై అసలు తీర్మానం చెయ్యాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని? ఎవరు అభ్యంతరం చెప్పారని? అమరావతి నిర్మాణాలను ఎవరు అడ్డుకున్నారని? వీటన్నింటికీ చంద్రబాబు సమాధానం చెప్పాలని ప్రశ్నించడానికి సిగ్గనిపించడం లేదా సజ్జలా? రాజధానికి భూములిచ్చిన రైతులను పగవాళ్లుగా భావించి వారిని అన్నిరకాలుగా హింసించిన మీరు.. ఇప్పుడు అదే అమరావతి రైతులపై కపట ప్రేమ ప్రదర్శించడం వారిని మోసం చెయ్యడం కాదా? గత ఎన్నికల్లో ప్రజలు సింగిల్ డిజిట్‌కు పరిమితంచేసి.. మీ మూడు రాజధానుల తుగ్లక్ నిర్ణయాన్ని ప్రజలు కాలరాశారు. అమరావతిపై ఆ అడ్డంకులను తొలగించి, మీవంటి ద్రోహుల స్వార్థరాజకీయానికి అడ్డుకట్టవేసేందుకు రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తుంటే అది మీకు డ్రామాగా కనిపిస్తోందా? అమరావతిని అడ్డుకున్న వారెవరో, అగాధంలోకి నెట్టిన వారెవరో -ప్రజలకు బాగా తెలుసు. మీరుచెప్పే సుద్దులు ఇప్పుడు అరణ్య రోదనలే. అమరావతిని విధ్వంసం చేసిన విధ్వంసకారులకు అసెంబ్లీ తీర్మానం మింగుడు పడకపోవచ్చు. కానీ రాజధాని నిర్మాణం ఆగదు. ఆంధ్రుల కల చెదిరిపోదు.

అమరావతి అన్న పేరు పలకడానికి కూడా ఇష్టపడని జగన్ ముఠాకి అమరావతిపై అవాజ్య ప్రేమ పుట్టుకు రావడం వింతగా వుంది. నిజంగా అమరావతిపై చిత్తశుద్ధివుంటే అసెంబ్లీకి వచ్చి తీర్మానానికి జగన్‌రెడ్డి మద్దతు తెలపగలరా? అమరావతికి వ్యతిరేకం కాదని జగన్ చెప్పాలి తప్ప సజ్జల చెప్పడమేంటి? అమరావతిని చంపేయడానికి వైసీపీ చెయ్యని ప్రయత్నం లేదు. నేడు ఒక్కసారిగా అమరావతిపై ప్రేమ పుట్టుకొచ్చి సుద్దులు చెబుతోంది. రాజధానిగా అమరావతినే కొనసాగించాలని రైతులు, మహిళలు రాత్రి పగలు 1630 రోజులు ఆందోళన చేసినా, భూములిచ్చిన రైతులు గుండెలు ఆగినా, ఆత్మహత్యలు చేసుకొంటున్నా పట్టించుకోకుండా ఎవరు అడ్డువస్తారో చూస్తాం, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజధానిని విశాఖకు తరలించి తీరతామని వైసీపీ మంత్రులు, పార్టీ నేతలు సవాళ్లు చేశారు. సీఆర్‌డీఏ రద్దు చేసి నిరంకుశంగా మందబలంతో వికేంద్రీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించుకొన్నవారు.. నేడు అమరావతికి ఎవరు అడ్డుపడ్డారంటూ చేతశుద్ధి తప్ప చిత్తశుద్ధిలేని సజ్జల సుద్దులు చెబుతూ.. అధికారిక తీర్మానాన్ని తప్పుపట్టడం హాస్యాస్పదం. గత ప్రభుత్వం సృష్టించిన న్యాయపరమైన చిక్కులను, గెజిట్ గందరగోళాన్ని తొలగించి, అమరావతే ఏకైక రాజధాని అని చట్టబద్ధంగా చాటిచెప్పడమే ఈ తీర్మానం ఉద్దేశం. అమరావతిపై తీర్మానం విధ్వంసకారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఒక రాష్ట్ర రాజధానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఈవిధంగా బిల్లు ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. కానీ అమరావతిని ప్రత్యేక అంశంగా పరిగణించి కేంద్రం చట్టబద్ధత కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం అమరావతిపై కక్షగట్టి, రాజధానిని అక్కడినుంచి తరలించేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో భవిష్యత్తులో మరెవరూ రాజధానిని కదిలించేందుకు వీల్లేకుండా కట్టుదిట్టం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో ఏ రాష్ట్రం రాజధానిని చట్టంచేసి రక్షించుకోవాల్సిన అగత్యం ఏర్పడలేదు. దేశంలోని 28 రాష్ట్రాల్లో ఒక్క రాష్ట్రానికి కూడా రాజధాని చట్టబద్ధత కోసం ప్రత్యేక చట్టం చేయాలన్న డిమాండ్ రాలేదు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రభుత్వంమారితే రాజధాని మారే ప్రమాదం ఏర్పడి. రాజధానిని రక్షించుకోవడానికి చట్టం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది? ఎక్కడ ప్రభుత్వం మారితే రాజధాని మారుతుందా? అనే చర్చ జరగలేదు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రాజధాని అంశం ప్రాంతీయ విద్వేషాలకు ఇంధనంగా మారి చట్టబద్ధత కల్పించాల్సిన స్థాయికి దిగజారి.. రాజధానిని చట్టంలో బంధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్‌లో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా చట్టబద్ధత రక్షణ కవచంలా పనిచేస్తుంది. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే రాష్ట్ర ప్రజలు, రాజధాని రైతులతోపాటు.. అన్ని వర్గాల్లోనూ ఒక భరోసా ఏర్పడుతుంది.

*- నీరుకొండ ప్రసాద్*

## సత్య స్వరూపుడు... ధర్మ రక్షకుడు శ్రీరాముడు

● నవమి వేడుకుల్లో పాల్గొన్న వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్



విశాఖపట్నం (చైతన్యరథం): మానవ పరిమితులకు లోబడి ఉంటూనే అత్యున్నత విలువల్ని పాటించి తనను తాను దైవంగా మలచుకున్నాడు శ్రీరామచంద్రుడు. సత్య స్వరూడు.. ధర్మ రక్షకుడిగా శ్రీరాముడు నిలిచాడని ఆయన చూపిన ధర్మమార్గన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ వ్యాఖ్యానించారు. శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని విశాఖపట్నంలో పలు ప్రాంతాల్లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన ఆయన అనంతరం స్థానికులతో కలిసి భక్తులకు అన్నదానం చేశారు. శ్రీరాముని కళ్యాణోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని, రాష్ట్రంపై ఆ శ్రీరాముడి కరుణ ఎప్పటికీ ఉండాలని ప్రార్థించానని ప్రణవ్ గోపాల్ తెలిపారు.

## రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

● రూ.2 కోట్లతో రహదారులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే విజయ్‌చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): నియోజకవర్గంలో ఒకవైపు పంచాయతీరాజ్, మరోవైపు ఆర్అండ్ బీ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర వివరించారు. పార్వతీపురం నుంచి బాలగూడ, వల్లరిగొడవ వరకు నాబార్డు నిధులు రూ.2 కోట్లతో రహదారులకు శంకుస్థాపన చేశామన్నారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన రహదారిని నిర్మించాలన్నారు. అగ్నిమాపక కేంద్రం భవనం, విద్యార్థులకు వసతి గృహాలకు సంబంధించిన భవనాల పనులు వేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో సూపర్ సిక్స్ పథకంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, నాయకులు వెంకటనాయుడు చంటి, వెంకటేశ్ రాజశేఖర్, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

## రూ.18 కోట్లతో రోడ్ల అభివృద్ధి : ఎమ్మెల్యే అదితి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 18.39 కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. తన కార్యాలయంలో రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ఎంతెంత నిధులు అవసరమనే విషయమై ఆమె అధికారులతో చర్చించారు. రోడ్డు పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసుకొని.. ముందుకు సాగాలని సూచించారు. పనుల నాణ్యతో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

## శ్రీకాకుళంలో వడగళ్ల వాన... నేలకొరిగిన చెట్లు



బూర్జ (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. మండలంలోని పలు గ్రామాలతో పాటు సరుబుజ్జిలి, ఆమదాలవలస, ఎల్.ఎన్‌పేట, తదితర మండలాల్లో వడగళ్ల వర్షానికి పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అడుగువేయలేనంత దట్టంగా వడగళ్లు పడటంతో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అరటి, మామిడి, జీడీ, కూరగాయల రైతులు వాపోతున్నారు. చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

## సీతారాముల కళ్యాణోత్సవం... పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి



విజయనగరం (చైతన్యరథం): శ్రీ రామనవమి సందర్భంగా ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన నెల్లిమర్లలోని రామతీర్థంలో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రభుత్వం తరపున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీసమేతంగా సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి దంపతులు, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, సూర్యనారాయణ రాజు, ఎస్సీ ఏ.ఆర్ దామోదర్, మార్కెఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి దర్శన టిక్కెట్ల బుకింగ్స్‌లో మార్పులు... ఇకపై సులువుగా

తిరుమల (చైతన్యరథం): టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీవాణి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో కీలక మార్పులు చేసింది. శుక్రవారం నుంచి కొత్త రూల్స్‌ను టీటీడీ అమల్లోకి తెచ్చింది. శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేలు విరాళం ఇచ్చినవారు రూ.500 అదనంగా చెల్లించి వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళం ఇచ్చిన తర్వాత దర్శనం టికెట్‌కు రూ.500 చెల్లించేలోపు టికెట్ అయిపోయినట్లు చూపిస్తోంది. దీంతో ఈ విషయంపై భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళం ఇచ్చినవారు వీఐపీ బ్రేక్ దర్శనానికి టికెట్లు బుక్ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన టీటీడీ.. టికెట్ల బుకింగ్ విషయంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇక నుంచి శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.10 వేలు, వీఐపీ బ్రేక్ దర్శనానికి రూ.500 ఒకేసారి చెల్లించవచ్చు. అంటే రూ.10,500 ఒకేసారి చెల్లించవచ్చు. దీని వల్ల టికెట్లు వెంటనే బుక్ అవుతాయి. టికెట్ కోసం ప్రత్యేకంగా చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఈ మార్పులను అమలు చేసేందుకు పేమెంట్ గేట్‌వేకు సంబంధించి యూనియన్ బ్యాంక్ ఇండియాకు టీటీడీ బాధ్యతలు అప్పగించింది. దీంతో భక్తులు యూపీఐ, నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా ఒకేసారి చెల్లింపులు చేయవచ్చు. అయితే ఈ ఏడాది జనవరి 9వ తేదీ నుంచి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేస్తోంది. ప్రతీ రోజు 800 టికెట్లను జారీ చేస్తోంది. ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో టికెట్లను విడుదల చేస్తారు. కేవలం 1Oి3 భక్తులకు మాత్రమే బుక్ చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. ఒక ఐడీపై టికెట్ బుక్ చేసుకుంటే మళ్లీ వారంపాటు ఆ ఐడీపై టికెట్ బుక్ చేసుకోలేరు.

## అనకాపల్లిలో హడలెత్తించిన 13 అడుగుల భారీ గిరినాగు

● గాఢ నిద్రలో ఉన్న రైతు పక్కనే బుసలుకొట్టిన వైనం

● చాకచక్యంగా బంధించి అడవిలో వదిలిపెట్టిన స్నేక్ క్యాచర్



అనకాపల్లి (చైతన్యరథం): ఆరుగాలం కష్టపడి, అలసిపోయి పశువుల పాకలో నిద్రపోయిన ఆ రైతుకు.. తను మృత్యువు అంచున ఉన్నానని తెలియదు. కళ్లు తెరిచి చూసేసరికి ఎదురుగా సాక్షాత్తూ యమపాశంలా బుసలు కొడుతున్న భారీ గిరినాగు! వెన్నులో వణుకు పుట్టించే ఈ ఘటన అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం గదబూరు గ్రామంలో చోటుచేసుకుంది. గదబూరుకు చెందిన శేఖర్ అనే రైతు ఎప్పటిలాగే తన పశువుల షెడ్డులో నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో ఏదో వింత శబ్దం వినిపించడంతో ఏమై ఉంటుందా అని నిద్రనుంచి లేచి కూర్చున్నాడు. చుట్టూ చీకటి.. తన వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో లైటు వేసి చుట్టూ చూశాడు.. అంతే శేఖర్‌కు గుండె ఆగినంత పనైంది. ఆహారం కోసం వెతుక్కుంటూ వచ్చిన సుమారు 13 అడుగుల భారీ గిరినాగు అక్కడ తిష్ట వేసి ఉంది. తన మంచానికి అడుగు దూరంలో చుట్టు చుట్టుకొని ఉన్న అంతపెద్ద పామును చూసిన శేఖర్, భయంతో వణికిపోతూ ప్రాణాలు అరచేత పట్టుకుని అక్కడి నుండి పరుగులు తీశాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే స్నేక్ క్యాచర్ వెంకటేష్‌కు సమాచారమిచ్చారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న స్నేక్ క్యాచర్ రెండు గంటల పాటు ప్రాణాలకు తెగించి పాముతో పోరాడాడు. ఎట్టకేలకు ఆ గిరినాగును చాకచక్యంగా బంధించారు. ఈ క్రమంలో సెల్ఫీలు, వీడియోల కోసం జనం ఎగబడటంతో కాసేపు అక్కడ వాతావరణం ఉత్కంఠగా మారింది. అనంతరం ఆ 13 అడుగుల గిరినాగును సురక్షితంగా అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఏప్రిల్ మూడో వారంలో ఇంటర్మీడియట్ ఫలితాలు

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 25తో ముగిసిన సంగతి తెలిసిందే. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలకు మొత్తం 10,57,312 మంది విద్యార్థులు ఈసారి పరీక్షలు రాశారు. ఇందులో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 5,31,275 మందికి గాను 5,21,266 మంది హాజరయ్యారు. అలాగే సెకండ్ ఇయర్ 5,26,264 మందికి గాను 5,16,646 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రకటించింది. మరోవైపు ఇంటర్ ఎగ్జామ్స్ వాల్యుయేషన్ కూడా ఇప్పటికే మొదలైంది. ఏప్రిల్ 10 నుంచి 14 మధ్య మూల్యాంకనం పూర్తి చేసేందుకు ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది. అనంతరం చకచకా మార్పుల నమోదు ప్రక్రియ పూర్తి చేసిన ఏప్రిల్ 21లోపు ఇంటర్ ఫలితాలను వెల్లడించాలని ఇంటర్ బోర్డు భావిస్తుంది. మే తొలి వారంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించే అవకాశం ఉన్నందున.. ఈ మేరకు ఏప్రిల్ మూడో వారంలో ఫలితాలు వెల్లడించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## వధువు సీతాదేవికి 108 రకాల పదార్థాలతో సారె



పి.గన్నవరం (చైతన్యరథం): అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. కోనసీమ జిల్లాకు చెందిన గృహిణి పేరిచర్ల సత్యవాణి 108 రకాల పదార్థాలతో సీతమ్మకు సారె సమర్పించారు. సత్యవాణి రామభక్తురాలు. ఆమె 18 సంవత్సరాలుగా శ్రీరామనవమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. రాములోరి కల్యాణాన్ని పురస్కరించుకుని వరుడు రాముడు తరపున వధువు సీతాదేవికి 108 రకాల పదార్థాలతో కంత (సారె) సమర్పించారు. 300 లీటర్ల పాలతో కోవా తయారు చేసి ఆ కోవాతో వివిధ ఆకృతుల్లో పదార్థాలు తయారు చేసి కంతలో ఉంచారు. గోదావరి నది వద్ద జరిగిన రాములవారి కల్యాణ వేడుకలో సారెను సమర్పించారు. కల్యాణానికి వచ్చిన భక్తులు ఈ 108 రకాల పదార్థాలను ఆసక్తిగా చూశారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# ప్రజలకు సాయం చేయడంలోనే సంతృప్తి

**●9వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు 214 ఉచిత సైకిళ్లు అందజేసిన మంత్రి నిమ్మల రామానాయుడు**



ఆపదలో, కష్టాల్లో, ఇబ్బందుల్లో, సమస్యల్లో ఉన్న ప్రజలకు మేలు జరిగేలా సాయం అందించడంలోనే నిజమైన సంతృప్తి కలుగుతుంది. ధర్మారావు ఫౌండేషన్‌తో పాటు మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు మేలు జరిగే పనులకే అధిక ప్రాధాన్యతనిస్తూ పని చేస్తున్నానని, నా వ్యక్తిగత లబ్ధి కోసం ఏనాడు పనిచేయలేదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శు క్రవారం మంత్రి నిమ్మల ఆధ్వర్యంలో మండవ ఫౌండేషన్ సి.ఎస్.ఆర్ నిధులతో లంకలకోడేరు, శివదేవుని చిక్కాల జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 214 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఆయన ఉచితంగా సైకిళ్లను అందజేశారు. విద్యార్థిని విద్యార్థులతో మంత్రి మమేకమై సరదాగా కొద్దిసేపు గడిపారు. పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించడంతో పాటు మంత్రిగా అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజల తీర్చుకునేలా రోజుకు 18 గంటల పాటు శ్రమిస్తున్నానని, అందులో భాగంగానే నియోజకవర్గ అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు నిధులు తీసుకువస్తున్నానని చెప్పారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్... ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి అప్పులపాలు చేసాడన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలో ముఖ్యమైన పనులతో పాటు ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలకు వివిధ కంపెనీలు, ఏజెన్సీలు ద్వారా సిఎస్ఆర్ నిధులను తీసుకువచ్చేలా కృషి చేస్తున్నానని, అందులో భాగంగానే మండవ ఫౌండేషన్ ద్వారా సైకిళ్లకు సిఎస్ఆర్ నిధులను ఇచ్చింది అన్నారు. నియోజకవర్గంలో 9వ తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులకు దశలవారీగా సైకిల్లు అందజేయడం జరుగుతుందన్నారు. పరిపాలన దక్షత గల చంద్రబాబు, ఆయనకు తోడు పవన్ కళ్యాణ్, వీరికి అండగా మోడీల కలయికతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలన రాక్షసతత్వంగా, వేధింపులు కక్షలు, అత్యాచారాలు హత్యలతో సాగిందని, అటువంటి పరిస్థితి భవిష్యత్తులో మన పిల్లలకు ఎదురు కాకూడదంటే మంచి కూటమి ప్రభుత్వం ను మరో పదిహేనేళ్లు కొనసాగేలా ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధియే కాకుండా ఎన్నో ఏళ్లుగా ధర్మారావు ఫౌండేషన్ ద్వారా వేసవిలో చలివేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉచిత భోజనాలు, 110 వరకు రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, కైలాస రథం, పేజర్ బాక్సులు, అగ్నిప్రమాదం, వరదలో వంటి ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో సాయం, టిడ్కో కాలనీ వాసులకు ఉచిత వాహనం, పలు శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా వంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని మంత్రి రామానాయుడు చెప్పుకొచ్చారు. మండవ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడుతూ ఫౌండేషన్ సభ్యులైన బి సుబ్బారావు, మూర్తిలను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రామాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాం



నిడదవోలు (చైతన్యరథం) : స్థానిక రామాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం, నిడదవోలు ప్రాంతాల్లోని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని ఆయన దర్శించుకొని ప్రజలందరికీ శ్రీరామనవమి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భద్రాచలం, ఒంటిమిట్ట తరహాలో నిడదవోలు నియోజకవర్గంలో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షించే మహత్ భాగ్యం కలిగినందుకు అదృష్టంగా భావిస్తున్నానన్నారు. స్థానిక రామాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల నాటికి ఆ ఆలయాలు సరికొత్త రూపాన్ని సంతరించుకుంటాయని మంత్రి పేర్కొన్నారు.

# శ్రీరాముని శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరంలో వివిధ ప్రాంతాల మీదుగా చేపట్టిన భారీ బైక్ ర్యాలీలో నగర ప్రముఖులతో కలిసి ఆయన పాల్గొన్నారు. శ్రీరాముని జయజయధ్వానాలతో, భక్తి గీతాలతో, కాషాయ పతాకాలతో నగరం అంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. యువత పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో పాల్గొని శ్రీరాముడిపై తమ భక్తిని చాటుకున్నారు. నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ఈ ర్యాలీ కొనసాగగా ప్రజలు రోడ్ల వెంట నిలబడి భక్తులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మానికి ప్రతీక అని, ఆయన చూపిన మార్గంలో నడిస్తే సమాజం శాంతి, సౌభ్రాతృత్వాలతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి వేడుకలను మరింత వైభవంగా నిర్వహించుకోవాలని, యువత మంచి మార్గంలో నడుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. నగరంలో శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయని, అన్ని ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని పండుగను విజయవంతం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నగరంలోని పలు రామాలయాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజాప్రతినిధులు, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విశాఖ తీరానికి ఎల్‌పీజీ, చమురు నౌకలు... తీరనున్న కష్టాలు

పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో గ్యాస్, ఇంధన నిల్వలపై ప్రజలలో ఆందోళనలు నెలకొన్న సమయంలో ఈ విషయం అందరికీ శుభవార్తనే చెప్పుకోవాలి. గ్యాస్, ఆయిల్ కొరత వస్తుందనే భయంతో గ్యాస్ స్టేషన్ వద్ద, పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరారు. ఇప్పుడు అలాంటి అవసరం ఇక ఉండదు. విశాఖ తీరానికి ఎల్‌పీజీ, చమురు నౌకలు ఒక్కొక్కటిగా చేరుకుంటున్నాయి. ఇవి తీరానికి చేరడంతో ఇకపై సరఫరా సమస్యలు తీరనున్నాయి.

# గ్రీవెన్స్‌డే చేపట్టిన ఎమ్మెల్యే ముప్పిడి

**●పలువురి నుంచి వినతులు స్వీకరణ**



కొవ్వూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శు క్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు వారి సమస్యలు తెలియజేస్తూ సుమారు 18 వినతిపత్రాలను అందజేశారు. తక్షణ పరిష్కార దిశగా పలు సమస్యలపై సంబందిత అధికారులతో మాట్లాడారు. అనంతరం టీడీపీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తీసుకోవాల్సిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామ కృష్ణ, దాయన రామకృష్ణ, సూరపని చిన్ని, సూర్యదేవర రంజిత్, పొట్రూ మురళీ, పొట్రూ శ్రీనివాస్, సుంకర సత్తిబాబు, మేకల శ్రీను, దిర్సిపోము సోమలక్ష్మి, ఎరుబండి వీర వెంకటరావు, జొన్నా బాలకృష్ణ, అయినపర్తి రాజేంద్రప్రసాద్, కొక్కిరిపాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల తాగునీటి సమస్యల పరిష్కారానికి ముగింపు

**●ప్రభుత్వం నుంచి రూ.19 కోట్లు మంజూరు**

**●పంచాయతీరాజ్ శాఖ నిధులతో 6 గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారం**

**●పాత, కొత్త తాగునీటి చెరువుల్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): టీడీపీ ప్రభుత్వంలో, చంద్రబాబు నాయకత్వంలో చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలు ఎన్నడూ తాగునీటి సమస్య ఎదుర్కోలేదని, ఎన్ని ఇబ్బందులున్నా ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంలో తామెప్పుడూ సంకోచించలేదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. శుక్రవారం ఆయన పట్టణ శివారులోని సమ్మర్ స్టోరేజ్ వాటర్ ట్యాంకుల్లో (పాత, కొత్త తాగునీటి చెరువులు) నీటిని నింపే పనులను కూటమినాయకులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసిన ప్రత్తిపాటి.. వేసవికాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడకూడదని స్పష్టంచేశారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రజల నుంచి చిన్న ఫిర్యాదు వచ్చినా యంత్రాంగపై కఠిన చర్యలుంటాయని ఆయన తెలిపారు. ట్యాంకుల పరిశీలనానంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిత్వంలో, టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ చిలకలూరిపేట పట్టణ వాసులకు తాగునీటి సమస్య ఎదురుకాలేదని ప్రత్తిపాటి చెప్పారు. గత ప్రభుత్వం నిత్యం తాగునీరు సరఫరా చేయలేక చేతులెత్తేసిందని, కానీ ఇన్నేళ్లలో టీడీపీ హాయాంలో ఎన్నడూ అలాంటి పరిస్థితి రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకున్నామని ఆయన తెలిపారు. పట్టణ ప్రజల నీటి అవసరాలు తీర్చే రెండు ప్రధాన ట్యాంకులను (చెరువుల్ని) పూర్తిగా నీటితో నింపుతున్నామని, ఒక ట్యాంకు రేపటికి, మరో ట్యాంకు వారంలో నిండుతుందన్నారు. ఈ రెండు చెరువుల్లోని నీటితో వేసవి నీటి అవసరాలు పూర్తిగా తీరతాయని ప్రత్తిపాటి తెలిపారు.

6 గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలకు ప్రభుత్వం నుంచి రూ.19కోట్లు మంజూరు ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో వేగంగా స్పందిస్తున్న కూటమిప్రభుత్వం నియోజకవర్గంలోని 6 గ్రామాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.19 కోట్ల నిధులు కేటాయించినట్టు ప్రత్తిపాటి చెప్పారు. వరుసక్రమంలో ఉన్న పసుమర్రు, గొట్టిపాడు, ఈవూరివారి పాలెం, వేలూరు, సందెపూడి, కుక్కపల్లివారి పాలెం గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే వ్యవస్థ నిర్మాణపనులకు ఈ నిధులు వినియోగించనున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఈ పనులకు సంబంధించిన టెండర్లను వచ్చే నెలలో ఖరారు చేయనున్నట్టు ఆయన చెప్పారు.

# అగ్గిపెట్టెపై రామయణాన్ని చిత్రీకరించిన కళాకారుడు



శ్రీరాముడిపై తనకు ఉన్న భక్తిని చిత్రం రూపంలో చూపించాలనుకున్నాడు నంద్యాలకు చెందిన చిత్రీకారుడు కోటేష్. చిన్న అగ్గి పెట్టెపై శ్రీరాముడి జననం నుంచి సీతాదేవి అగ్నిపరీక్ష వరకు జరిగిన ప్రధాన ఘట్టాలన్నింటిని సూక్ష్మ రూపంలో అద్భుతంగా వేసి అందిరి ప్రశంసలు పొందుతున్నాడు.

# దేశ వ్యాప్తంగా నర్సింగ్ విద్య బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు

◆47 నర్సింగ్ పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం

◆లోక్ సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్నకు సమాధానం



న్యూ ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): దేశంలో నర్సింగ్ విద్యను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో వెల్లడించారు. నర్సింగ్ విద్యావిధానం, పథకాలు, నర్సింగ్ విద్యకు ప్రోత్సాహం తదితర వాటి వివరాలు కోరుతూ విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో శుక్రవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న నర్సింగ్ స్కూళ్లను నర్సింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు 'డెవలప్‌మెంట్ ఆఫ్ నర్సింగ్ సర్వీసెస్' పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 47 నర్సింగ్ పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆమోదం తెలిపిందన్నారు. అప్ గ్రేడేషన్ మార్పు నిమిత్తం ఒక్కో సంస్థకు రూ.7 కోట్ల వరకు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల అమలు బాధ్యత పూర్తిగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలదేనని మంత్రి స్పష్టం చేశారు. కేటాయించిన నిధుల వినియోగ ధ్రువపత్రాలు, ఎప్పటికప్పుడు నివేదికలు, సమీక్షా సమావేశాల ద్వారా కేంద్రం ఈ పనుల పురోగతిని పర్యవేక్షిస్తుందని మంత్రి తెలిపారు. కేవలం అప్‌గ్రేడేషన్‌తో ఆగకుండా, భవిష్యత్తులో ఆరోగ్య అవసరాలతో పాటుగా వనరుల లభ్యతను బట్టి ఈ పథకాన్ని మరింత విస్తరించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు మెరుగైన శిక్షణ, అత్యాధునిక మౌలిక వసతులు కల్పించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఈ పథక ప్రధాన ఉద్దేశమని కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు.

# ధర్మాన్ని నాలుగు పాదాలపై నడిపించిన ధర్మమూర్తి శ్రీరామచంద్ర ప్రభు

◆నవమి వేడుకుల్లో పాల్గొన్న టీడీపీ సీనియర్ నేత వై.వీ.బి రాజేంద్రప్రసాద్



ఉయ్యూరు (చైతన్యరథం): ధర్మాన్ని నాలుగు పాదాలపై నడిపించిన ధర్మమూర్తి శ్రీరామచంద్ర ప్రభు అని, ఆయన పాటించిన నీతిని ప్రతిఒక్కరూ అనుసరించాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వీ.బి రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా ఉయ్యూరు కాపుల రామాలయం, కాటూరులోని శ్రీరామ మందిరం వద్ద నిర్వహించిన సీతారాముల కళ్యాణంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి సమాజం శ్రీరామచంద్ర మూర్తి చూపిన ధర్మ మార్గంలో నడుస్తూ ముందుకు సాగాలన్నారు. కుల మతాలకు అతీతంగా అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాక్షి అబద్ధపు రాతలు - అభివృద్ధికి ఆటంకాలు

◆ టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్ మండిపాటు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పార్లమెంటు సభ్యులు, ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధి రథసారథి కేశినేని శివనాథ్ (చిన్ని)పై 'సాక్షి' పత్రిక వండివార్చిన కథనం కేవలం ఆయనపై బురదజల్లే రాజకీయమే అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్ అన్నారు. సాక్షి దినపత్రికలో ఎంపీ కేసినేని చిన్ని ప్రతిష్ట దిగజార్చేలా వస్తున్న వార్తలను పరుచూరి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. క్షేత్రస్థాయిలో ఎంపీ కేశినేని చిన్ని సాధిస్తున్న విజయాలను, ప్రజల గుండెల్లో ఆయన సంపాదించుకున్న నమ్మకాన్ని చూసి తట్టుకోలేక చేస్తున్న కుట్రలో భాగమే సాక్షి పత్రికలో వస్తున్న బూటకపు కథనాలని పేర్కొన్నారు.? సాక్షి పత్రికకు, వారి వెనుక ఉన్న శక్తులకు ప్రగతి పథంలో పయనిస్తున్న ఎన్టీఆర్ జిల్లాలో అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. విజయవాడలో జరుగుతున్న అభివృద్ధి పనుల మీద ఉన్న శ్రద్ధ, ప్రజా సమస్యల పరిష్కారం మీద ఉన్న ధ్యాస మీకు బులుగు వార్తలుగా కనిపించడం లేదా? అంటూ ఎద్దేవా చేశారు. కేవలం వ్యక్తిగత ప్రతిష్ట దిగజార్చడం సాక్షి పత్రికను అడ్డుపెట్టుకుని కట్టుకథలతో ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం వైసీపీ నాయకుల దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాలకులు ధర్మబద్ధంగా ఉండాలి : ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

◆ దేవుడి ఆస్తిని తిరిగి దేవుడికే దక్కేలా చేయడం ఎంతో తృప్తినిచ్చింది... శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం నియోజకవర్గ ప్రజలందరిపై శ్రీ రాముని ఆశీస్సులు ఉండాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కోరారు. నియోజకవర్గవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఉంగుటూరు మండలం ఆత్కూరు, గన్నవరం మండలం దావాజీగూడెం, విజయవాడ రూరల్ ఎనికేపాడు గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా దావాజీగూడెంలోని గొంది బాబయ్య చారిటబుల్ ట్రస్ట్ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంకు చెందిన భూముల వివాదం ఎట్టకేలకు సానుకూలంగా పరిష్కారమైందని ఆలయ నిర్వాహకులు, అర్చకులు యార్లగడ్డకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దాదాపు 130 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ దేవస్థానం భూపోరాటంలో, నాడు 1918లో చల్లపల్లి రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ జోక్యం చేసుకుని ఈ ఆస్తిని కాపాడగా, నేడు మళ్లీ అదే వంశానికి చెందిన యార్లగడ్డ వెంకట్రావు ఆ ఆస్తిని కాపాడారని తెలిపారు. గన్నవరం విమానాశ్రయ విస్తరణలో భాగంగా ప్రభుత్వం సేకరించిన ఆలయానికి చెందిన 4 ఎకరాల 32 సెంట్ల భూమిని గతంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ట్రస్టుకు అన్యాయం జరిగిందని వాపోయారు. దీనిపై ప్రస్తుత ఎమ్మెల్యే అసెంబ్లీలో గళమెత్తడంతో ప్రభుత్వం స్పందించి, అమరావతిలోని వెలగపూడిలో సుమారు 4,330 గజాల నివాస స్థలం, 1,950 గజాల వాణిజ్య స్థలం కేటాయించారని చెప్పారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి ప్రస్తుత విలువ సుమారు 19 కోట్ల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... దావాజీగూడెం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ భూములను కాపాడి, దేవుడి ఆస్తిని తిరిగి దేవుడికే దక్కేలా చేయడంపై తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. దేవుడితో పెట్టుకుంటే ఎవరైనా తలవంచాల్సిందేనని, మనుషులు మనుషుల్లా ప్రవర్తించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు.

# హిందూపుర్ టూ అమరావతి సైకిల్ యాత్ర

◆ గుంటూరు చేరుకున్న సైకిల్ యాత్రికుడు మంజునాథ్... సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే గళ్ళామాధవి



గుంటూరు (చైతన్యరథం): హిందూపురం నుండి రాజధాని అమరావతి వరకు "ఒక్క అడుగు బాధ్యత వైపు" అనే లక్ష్యంతో మంజునాథ్ అనే యువకుడు చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం గుంటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా సైకిల్ యాత్రికుడు శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... సమాజంలో హక్కుల కోసం పోరాటం జరుగుతున్నప్పటికీ బాధ్యతల పట్ల నిర్లక్ష్యం పెరుగుతున్నదని, ఈ నేపథ్యంలో మంజునాథ్ బాధ్యతను గుర్తు చేస్తూ చేపట్టిన ఈ యాత్ర అభినందనీయమన్నారు. నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో ప్రతి గ్రామం, ప్రతి ఇంటిని సందర్శిస్తూ పిల్లలకు అవగాహన కల్పించడం గొప్ప కార్యక్రమమని, ప్రస్తుతం పోక్సో చట్టంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అబ్బాయిలు కూడా తెలియక తప్పిదాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, క్రమశిక్షణ, బాధ్యత వంటి అంశాలపై మంజునాథ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని, తన వ్యక్తిగత పనులను పక్కనపెట్టి సమాజ సేవలో భాగంగా ఈ అవగాహన యాత్ర కొనసాగించడం నిజంగా అభినందించాల్సిన విషయం అన్నారు. సైకిల్ యాత్ర మొదలైన దగ్గర నుండి మార్గంలో ప్రజా ప్రతినిధులను కలుస్తూ, వారి మద్దతుతో ముందుకు సాగుతున్న ఈ యాత్రకు తాము పూర్తిగా మద్దతు ఇస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పోక్సో చట్టంపై అవగాహనను విద్యా వ్యవస్థలో భాగం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# నందిగామలో ఆధ్యాత్మిక ఉత్సాహం... ఘనంగా శ్రీరాముని కళ్యాణమహోత్సవం

నందిగామ (చైతన్యరథం): పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కూటమినేతలు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... శ్రీరాముడి జీవితం ఆదర్శప్రాయం అని, మనుషులు సన్మార్గంలో జీవించాల్సిన తీరుతెన్నులను శ్రీరాముడు చాటి చెప్పారన్నారు. ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీసీతారాముల వివాహమహోత్సవాన్ని కన్నుల పండువగా జరుపుకుంటారని, వివాహ వ్యవస్థను ఆచారయోగ్యంగా ప్రపంచ దేశాలే గుర్తించాయని కొనియాడారు. శ్రీరాముడి ఆశీస్సులు అందరికి ఉండాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీరామచంద్రుని అస్తిత్వానికి మూలాధారం ధర్మం

◆శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామమోహన్



విజయవాడ (చైతన్యరథం): ధర్మానికి అర్థం చెప్పడంతో పాటుగా కుటుంబ వ్యవస్థకు అర్థం చెప్పిన ఆదర్శప్రాయుడు శ్రీరాముడు అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. శుక్రవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్‌లో కొండిన్య నగర్, ఎన్ఎస్ఎం స్కూల్ రోడ్డులో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొని పూజలు చేశారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీతారామ కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పలు చోట్ల పాల్గొని స్వామి కళ్యాణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... ఏ ప్రాంతానికి వెళ్ళినా శ్రీరామనవమి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయని చెప్పారు. శ్రీరాముడు ధర్మం పాటించి చూపారన్నారు. శ్రీరాముడు కుటుంబ వ్యవస్థకు అర్థం చెప్పారన్నారు. ప్రతి గ్రామంలో రాముని దేవాలయం ఉంటుందని చెప్పారు. ఆయన చూపిన విధంగా ధర్మం పాటిస్తే శ్రీరాముడిని పూజించినట్లేనని అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... శ్రీరాముడు మనిషి రూపంలో మానవుడు ఏవిధంగా జీవించాలి, ఏ విధంగా ధర్మాన్ని ఆచరించాలో శ్రీరాములవారు చూపించారన్నారు. శ్రీరాముని ధర్మాన్ని కాపాడటం ద్వారా ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండాలన్నారు.

జోన్-4

(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)

చైతన్యరథం

# పీ4 తోనే పేదరిక నిర్మూలన

## మునిసిపల్ శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని 53వ డివిజన్ వారధి సెంటర్ వద్ద గతనెలలో ప్రమాదవశాత్తు డ్రైనేజీ ట్యాంకర్ ఢీకొని ఇల్లు కోల్పోయిన మౌలాలి కుటుంబానికి మంత్రి అండగా నిలిచారు. నెల రోజుల్లోనే కొత్త ఇంటిని నిర్మించి శుక్రవారం గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ4 ద్వారా సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. పేదరికం నుండి విముక్తి పొందాలంటే నాణ్యమైన విద్యే మార్గమని, అందుకే నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయి కంటే మిన్నగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మానవత్వం ఉన్న గొప్ప నాయకుడు మంత్రి నారాయణ అని, ఆయన మాట ఇస్తే తప్పరని కొనియాడారు. నెల రోజుల క్రితం 53వ డివిజన్ వారధి సెంటర్ షుగర్ ఫ్యాక్టరీ ప్రాంతంలో లారీ దూసుకెళ్లి ఇల్లు కోల్పోయిన పేద ముస్లిం మైనారిటీ కుటుంబానికి, మంత్రి తన సొంత నిధులతో కేవలం నెల రోజుల్లోనే పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారని తెలిపారు. రాజకీయాల్లో ఇలాంటి నిబద్ధత గల నాయకులు అరుదుగా ఉంటారని, ఆపదలో ఉన్న పేదవాడికి నీడ కల్పించిన మంత్రి నారాయణను నెల్లూరు ప్రజలందరూ ఆశీర్వదించాలని ఈ రూప్ కుమార్ యాదవ్ పేర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత అశోక్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు విజేతా రెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ,టీడీపీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ నేతకు మంత్రి నారాయణ పరామర్శ

## ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

నెల్లూరు (చైతన్యరథం): అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 11వ డివిజన్ అధ్యక్షుడు నాగేంద్రను మంత్రి నారాయణ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల నాగేంద్ర హార్ట్ స్ట్రోక్‌కు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయనను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారాయణ, ఆసుపత్రికి వెళ్లి నాగేంద్ర ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు, ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని వైద్యులు వెల్లడించారు. మంత్రి నారాయణతో పాటు నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలు విజేతా రెడ్డి, టీడీపీ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి తదితరులు ఆయన వెంట ఉన్నారు. నాగేంద్రకు ధైర్యం చెప్పారు.

# ఎన్టీఆర్ చిల్డ్రన్ పార్కును ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



## స్వంత నిధులతో విద్యార్థులకు 115 సైకిళ్ల పంపిణీ

జె. పంగులూరు (చైతన్యరథం): మండలకేంద్రం రామకూరు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. తన సొంత సంస్థ సమకూర్చిన సైకిళ్లను 115 మంది విద్యార్థులకు మంత్రి అందజేశారు. అనంతరం దాత చెరుకూరి రంగబాబు మండవ రత్తయ్య శేషమ్మ జ్ఞాపకార్థం రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన ఎన్టీఆర్ చిల్డ్రన్స్ పార్కును మంత్రి ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.41 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు సైడ్ డ్రైను మంత్రి ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహంతోపాటు గోకనకొండ రామలింగస్వామి విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 10,700 సైకిళ్లను పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి పెదవల్లి అశోక్, తొట్టెంపూడి చంద్రశేఖర్, మానం సుబ్బారావు, మానం వెంకట్రావు, ఐటీడీపీ అధ్యక్షుడు మానం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం





మేదరమెట్ల (చైతన్యరథం): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో దాతల సహకారంతో రూ.6 కోట్ల నిధులతో ఇప్పటివరకు 10,600 సైకిళ్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్క పాఠశాలలో శుద్ధ జల కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానికుల సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వరగాని పద్మావతి, తెదేపా నాయకులు రవీంద్ర, నాగేశ్వరరావు, ఆమోసు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుమలలోని శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్ర స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. తిరుమల శ్రీ పెద్ద జీయర్ స్వామి, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాణి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో మార్పులు




## టీటీడీ నిర్ణయంతో శ్రీవారి భక్తులకు ఉపశమనం

తిరుమల (చైతన్యరథం): శ్రీవాణి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో తితిదే మార్పులు చేసింది. గతంలో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించింది. శుక్రవారం నుంచి భక్తులు శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేలు విరాళంతోపాటు, వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్‌కు రూ.500 కలిపి ఒకేసారి రూ.10,500 చెల్లించే అవకాశం కల్పించారు. దీనికి సంబంధించిన పేమెంట్ గేట్వే లావాదేవీలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పగించారు. ఇందుకోసం భక్తులు యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్‌తో చెల్లింపు చేయవచ్చు. భక్తుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను తితిదే కరెంట్ బుకింగ్ విధానంలో ఈ సంవత్సరం జనవరి 9 నుంచి ఆన్‌లైన్‌లో జారీ చేస్తున్నారు. కరెంట్ బుకింగ్ కోటా కింద ప్రతిరోజూ 800 టికెట్లను ఏరోజుకారోజు ఆన్లైన్లో విడుదల చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్లైన్లో టికెట్లు విడుదల చేయగా 103 భక్తులకు మాత్రమే టికెట్ బుకింగ్ అనుమతి ఇస్తున్నారు. ఒక ఐడీపై ఒకసారి టికెట్ పొందితే వారం పాటు టికెట్ పొందడానికి వీలుపడదు. ఇప్పటి వరకు భక్తులు శ్రీవాణి ట్రస్టుకు రూ.10000 విరాళం ఇచ్చి, ఇతర వివరాలు నమోదు చేసి రూ.500 చెల్లించేలోపు టిక్కెట్లు అయిపోయినట్లు ఫిర్యాదులు అందేవి. అప్పటికే శ్రీవాణి ట్రస్టు రూ.10వేలు విరాళం ఇచ్చిన భక్తులు రూ.500 చెల్లించి టికెట్లను కొనుగోలు చేసేవారు. దీంతో కరెంట్ బుకింగ్లో ట్రస్టుకు విరాళం అందించినవారు ఇబ్బంది ఏర్పడినట్లు ఫిర్యాదులు అందేవి. అయితే ప్రస్తుతం నూతన విధానంలో ఏరోజుకారోజు కరెంట్ బుకింగ్‌లో ఒకేసారి శ్రీవాణి దర్శన టికెట్లు భక్తులు పొందే అవకాశం కలిగింది.

# ఘనంగా సీతారాముల కళ్యాణం



నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని 46, 47వ డివిజన్‌లలో శ్రీరామ నవమి వేడుకలు ధర్మవరం టీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మురళీకృష్ణ మందిరం, మహాలక్ష్మి టెంపుల్ సెంటర్, కొరాడ వీధి, చిన్నబజార్ మార్కెట్ సెంటర్, మండపాల వీధి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీతారాముల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. 47వ డివిజన్‌లోని కృష్ణ మందిరం వద్ద 9 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఆలయ కమిటీ ప్రతిష్ఠించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ జనరల్ సెక్రెటరీ మోహనాచారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కమిటీ సభ్యుడు అద్దంకి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ముఖ్య అతిథిగా, 47వ డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ బృందం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారావు మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మం, సత్యం, న్యాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆయన ఆదర్శాలను అనుసరించడం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పవచ్చని అన్నారు. మదనంబేటి మునిశేఖర్, కల్వకుంట భాస్కర్, వీరమల్లు చంద్ర, కాంచి కృష్ణ, కల్వకుంట సుధ, ఎం. మునికుమార్, పీవీ రత్నం పాల్గొన్నారు.



# శ్రీశైలం అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలి : ముఖ్యమంత్రి చంద్రబాబు

నంద్యాల (చైతన్యరథం): శ్రీశైలం అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలి. భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. గురువారం రాత్రి ఆయన మంత్రులు బీసీ జనార్ధన్రెడ్డి, ఎన్ఎండీ పరూక్, ఇన్చార్జి మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, కలెక్టర్ రాజకుమారి గణియా. ఎస్పీ సునీల్ షొరాణతో భేటీ అయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు జిల్లాకు సంబంధించిన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. శ్రీశైలానికి నల్లమల మీదుగా వెళ్తున్న రహదారిని విస్తరించాలి.. రహదారి విస్తరణకు, అభివృద్ధి పనులకు స్థానిక అటవీశాఖ అధికారుల నుంచి సమస్యలు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్రెడ్డి పేర్కొన్నారు. అందుకు ముఖ్యమంత్రి స్పందిస్తూ ఆయా సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు.. ప్రజలు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూకక్కు సూచించారు.నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు సీఎంకు ఇవ్వగా వాటిపై చర్చించారు. డోన్లో జాతీయ గనుల పరిశోధన కేంద్రం, ఆళ్లగడ్డలో శిల్పకళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేలా కేంద్రానికి లేఖలు రాద్దామని పేర్కొన్నారు. ఆళ్లగడ్డను శిల్పకళా హబ్గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు . గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తే కర్నూలు పశ్చిమ ప్రాంతానికి పుష్కలంగా నీరందడమే కాకుండా కేసీ కాలువ ఆయకట్టు కిందట ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో సాగవుతున్న 2.65 ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించడానికి అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తెలుగుగంగ పరిధిలోని గండ్లేరు జలాశయం సామర్థ్యాన్ని 0.6టీఎంసీకి పెంచితే రైతులకు సాగునీరు అందడంతోపాటు 20 గ్రామాలకు, ఆళ్లగడ్డ పట్టణానికి మంచినీరు పుష్కలంగా ఉంటుందని ఎమ్మెల్యే అఖిలప్రియ చేసిన ప్రతిపాదన గురించి ఆరా తీశారు. ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలల వన్టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోవద్దని హెచ్చరించారు.

సామాజిక మాధ్యమాల్లోనూ చురుగ్గా ఉండాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య సమన్వయం ఉండాలని, నంద్యాల ఎంపీ, పాణ్యం ఎమ్మెల్యే. నందికొట్కూరు ఎమ్మెల్యేలు సఖ్యతగా ఉండాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యేలందరూ పనిచేయాలని సూచించారు. జిల్లాలో 40 ప్రభుత్వశాఖ పనితీరును సమీక్షించారు. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఎస్పీ సునీల్ షొరాణ్ అమలుచేస్తున్న 'వన్ రౌడీ వన్ పోలీస్ విధానం బాగుందని ముఖ్యమంత్రి కితాబిచ్చారు.

# ధ్వజారోహణంతో మోగిన కోదండరాముని కళ్యాణ గంటలు

ఒంటిమిట్ట (చైతన్యరథం): ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తితిదే పాంచరాత్ర ఆగమ శాస్త్రం సలహాదారు రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో యాగశాలలో హోమాలను



నిర్వహించారు. అనంతరం గరుడపటంతో ప్రదక్షిణ చేశారు. ధ్వజ స్తంభానికి విశేష పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. రాజంపేట సబ్ కలెక్టర్ భావన, రాజంపేట నియోజకవర్గం తెదేపా బాధ్యుడు చమర్తి జగన్మోహన్ రాజు. డిప్యూటీ ఈవోలు ప్రశాంతి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

# వచ్చే శ్రీరామనవమిలోగా ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు

## అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రకటన

అనంతపురం (చైతన్యరథం): శ్రీరామనవమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు, హిందూ ధర్మ పరిరక్షకుడు రాధా మనోహర్ దాస్ హాజరైన జై శ్రీరామ్ నినాదాల మధ్య బైక్ ర్యాలీని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రారంభించారు. తెల్లని వస్త్రాలు, కాషాయం తలపాగాతో కనిపించిన ఎమ్మెల్యే దగ్గుపాటి అందరినీ ఆకర్షించారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవ కమిటీకి అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమంతో నగరమంతటా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోందన్నారు. శ్రీరాముడు ఏ యుగానికైనా శ్రీరాముడే ఆదర్శ పురుషు డని ఎమ్మెల్యే దగ్గుపాటి పేర్కొన్నారు. రాముని బాటే మన బాట అని స్పష్టం చేశారు. నగరంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రముఖులు కోరగా వచ్చే ఏడాదిలోగా విగ్రహాన్ని ఏర్పాటు చేసామని ప్రకటించారు.





# ప్రజా సమస్యల సత్వరం పరిష్కరమే లక్ష్యం

## ప్రజా దర్బార్‌లో మంత్రి మండిపల్లి

రాయచోటి (చైతన్యరథం): ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం తన స్వగృహంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సమస్యలు, అభ్యర్ధనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలకు అందుబాటులో ఉండి,సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కొంతమంది అధికారులు ప్రజలు దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలందించి మంత్రిని సత్కరించారు.



# ఘనంగా రాములోరి కళ్యాణోత్సవాలు

ఆదోని (చైతన్యరథం): ఆదోని పట్టణంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని శక్రవారం పలు ఆలయాల్లో వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవాలు నిర్వహించారు. చిన్నయ మిషన్ కేంద్రంతో పాటు సీతారాంనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయం, భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో విక్టోరియా పేటలోని రుక్మిణి పాండురంగ స్వామి ఆలయం, నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అనంత మంగళ ఆంజనేయస్వామి ఆలయం, విశ్వహిందూ పరిషత్ కార్యాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలన్నీ కిక్కిరిసిపోయాయి.



# అహోబిలంలో ఘనంగా సీతారాముల కళ్యాణం

ఆళ్లగడ్డ (చైతన్యరథం): ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఆహోబిలం లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రాములవారి సన్నిధిలో ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి, సీతారామ లక్ష్మణుల ఉత్సవర్లను కొలువుంచి పంచామృతాలతో అభిషేకం చేశారు. పసుపు, చందనం, కర్పూరం వంటి లేఖనాలు సమర్పించి ధూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవారిని విశేషాలంకరణలో పల్లకిపై కొలువుంచి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఈ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రవాసాంధ్ర
చైతన్యరథం

# ప్రవాస తెలుగు ప్రముఖులకు వంశీ పురస్కారాలు



హైదరాబాద్:వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇచ్చే ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారాలలో భాగంగా, ఈ పరాభవ నామ సంవత్సర ఉగాదికి వివిధ దేశాల తెలుగు సంస్థలనుండి సాంస్కృతిక కళారంగ విభాగాలలో విభిన్న సేవలు అందిస్తున్నవారికి "వంశీ సీల్వెల్ ప్రవాస భారతీయ ఉగాది పురస్కారాలు" ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో అందజేశారు. ప్రముఖ సినీ నటులు డా. రాజేంద్ర ప్రసాద్, నటీమణులు సంగీత, మంజుభార్గవి, దర్శకులు రేలంగి నరసింహారావు, సినీకవి వనమాలి, ప్రముఖ సాహితీవేత్తలు, రచయితలు, వివిధ రంగాల కళాకారులను ఈ ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారాలతో వేదికపై సత్కరించారు.

### మాకు ఎంతో గర్వకారణం

వంశీ వేదికపై మా 'శ్రీ సాంస్కృతిక కళాసారథి' సంస్థ ప్రధాన కార్యనిర్వాహక వర్గ సభ్యురాలు, రచయిత్రి రాధిక మంగిపూడికి "సభా భారతి" బిరుదు ప్రదానం జరగడం సంతోషంగా ఉంది, మా సంస్థ సభ్యులైన యడవల్లి శేష కుమారి శాస్త్రీయ సంగీతంలోనూ, తంగిరాల సౌభాగ్యలక్ష్మి లలిత సంగీత రంగంలోనూ, పావని చిలువేరు సాహిత్య రంగంలోను ఉగాది పురస్కారాలను అందుకోవడం మాకెంతో గర్వకారణం" అని సింగపూర్ నుండి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కవుటూరు రత్నకుమార్ పేర్కొన్నారు. యూకే నుండి డా. బాబురావు చౌదరి చాపరాల ఉ భారతి దంపతులు, హాంకాంగ్ నుండి జయ పీసపాటి, ఖతార్ నుండి సాహిత్య జ్యోత్స్న కొలిపాక, యూఏఈ నుండి శ్రీకాంత్ చిత్తర్వు, శ్రీనివాస లింగం, సౌదీ అరేబియా నుండి కొనేరు ఉమామహేశ్వరరావు, అనిల్ కుమార్ కడించెర్ల, అమెరికా నుండి శ్రీనివాస్ గూడూరు, వాణి దిట్టకవి, జయరాం ఎర్రమిల్లి తదితరులు కూడా ఈ పురస్కారాలను అందుకున్నారు.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డా.కె వి రమణాచారి ఐఏయస్, హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం హెడ్ కామేశ్వరి, డా. వంశీ రామరాజు మరియు ఇతర అతిథుల చేతుల మీదుగా ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.





## వాట్స్ ఆధ్వర్యంలో ఘనంగా

# ఉగాది, శ్రీరామనవమి వేడుకలు

వాషింగ్టన్: వాషింగ్టన్ తెలుగు సమితి (Washington Telugu Samithi - WATS) తన 25వ సిల్వర్ జూబిలీ సంవత్సరంలో ఉగాది,శ్రీ రామనవమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించింది. నార్త్ షోర్ ఫర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి 1500కు పైగా తెలుగు కమ్యూనిటీ సభ్యులు హాజరై, వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా 30కి పైగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. 300మందికి పైగా కళాకారులుపాల్గొని నృత్యం,సంగీతం, ఇతర కళారూపాలతో ప్రేక్షకులను అలరించారు.

### పూర్వ అధ్యక్షులకు సన్మానం

వాట్స్ సిల్వర్ జూబిలీ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పూర్వ అధ్యక్షులను సన్మానించి, సంస్థ అభివృద్ధికి వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ వేడుకలకు పలువురు గౌరవ అతిథులు, కమ్యూనిటీ నాయకులు హాజరయ్యారు. వారిలో ముఖ్యంగా సీటెల్ కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా కాన్సుల్ సురేష్ శర్మ, బోథెల్ పోలీస్ చీఫ్ కెన్‌సుబెర్లిచ్, నార్త్ షోర్ స్కూల్ డిస్ట్రిక్ట్ బోర్డు ప్రెసిడెంట్ సాండీ హేయ్స్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఖేడం పలు సంస్థల కమ్యూనిటీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరందరిని ఘనంగా సన్మానించారు. ఈవేడుకలను విజయవంతం చేసిన పూర్వ అధ్యక్షులకు, గౌరవ అతిథులకు, కమ్యూనిటీ నాయకులకు స్పాన్సర్లు, దాతలందరికీ వాట్స్ అధ్యక్షుడు మధురెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన 70కి పైగా వాలంటీర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### విజయవంతంగా వేడుకలు

ఘన విజయంగా నిలిచిన వేడుక ఈ ఉగాది, శ్రీ రామనవమి వేడుకలు తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తూ, సమాజ ఐక్యతను చాటుతూ అత్యంత విజయవంతంగా నిర్వహించారు. వాట్స్ సంస్థ తన 25 సంవత్సరాల ప్రయాణాన్ని గర్వంగా కొనసాగిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్య క్రమాలకు సిద్ధంగా ఉంది. సంప్రదాయ విందు ప్రత్యేక ఆకర్షణ. ఈ వేడుకలో ముఖ్య ఆకర్షణగా అరిటాకులపైసంప్రదాయ విందు ఏర్పాటు చేశారు. 25కి పైగా వంటకాలతో కూడిన భోజనం ప్రతిఒక్కరికీ వడ్డించబడింది. ఇది తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా నిలిచింది.

# ఏపీలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు

### ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

న్యూజెర్సీ: ఐటి పరిశ్రమలకు వివిధ రాయితీలతో పాటు ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు అమలుచేస్తున్న ఏపీకి తరలిరావాలని ఐటీ పారిశ్రామికవేత్తలకు మన్నవ మోహన కృష్ణ పిలుపునిచ్చారు. అమెరికా పర్యటన సందర్భంగా న్యూజెర్సీలో ఐటీ పారిశ్రామికవేత్తలతో మన్నవ మోహన కృష్ణ భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో ఏపీలో ఐటీ విప్లవం వచ్చిందని, గూగుల్ డేటా సెంటర్, అమరావతి 'క్వాంటం వ్యాలీ'తో ప్రాజెక్టులతో అద్భుత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పెట్టుబడులకు ఏపీ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం లభిస్తుందని మన్నవ మోహన కృష్ణ చెప్పారు.

### ఆత్మీయ సమావేశం

ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఇటీవల అమెరికాలోని



న్యూజెర్సీ పర్యటన సందర్భంగా ఆయన సన్నిహితులు, మిత్రులు ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. రాయల్ ఆల్బర్ట్ ప్యాలె స్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మోహన కృష్ణ మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ తనకు ఎన్నో గొప్ప అవకాశాలతోపాటు ప్రాణ ప్రదమైన మిత్రులను అందించిన న్యూజెర్సీ రాష్ట్రం తన హృదయానికి ఎంతో దగ్గరైనదని అన్నారు. తన ఎదుగుదలలో భాగస్వాములై, అడుగడుగునా ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మన్నవ మోహనకృష్ణ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా...

### ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ ఆధ్వర్యంలో

# రక్తదాన శిబిరం

కువైట్: తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కువైట్‌లోని పసుపు సైనికులు భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గల్ఫ్ ఎంపవర్మెంట్ కో-ఆర్డినేటర్ కుదరవల్లి సుధాకరరావు, మద్దిన ఈశ్వర్ నాయుడు ఆధ్వర్యాన ఈకార్యక్రమం జరిగింది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదానంచేసిన దాతలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నారై లకోసం ప్రవేశపెట్టిన ప్రవాసాంధ్ర బీమాను ఉచితంగా చేయటం జరిగింది. రక్తదాతలకు అయ్యే బీమా ఖర్చు మొత్తాన్ని బిల్లా రమేష్ గారు స్పాన్సర్ చేశారు. శుక్రవారం సెలవు దినం కావటంతో భారీ సంఖ్యలో పసుపు సైనికులు విచ్చేసి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం రెండుచోట్ల అధాన్ బ్లడ్ బ్యాంక్, జాబ్రియా సెంట్రల్ బ్లడ్ బ్యాంక్ లో జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న రక్తదాతలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గారు పంపిన ప్రశంసా పత్రాన్ని అంద చేయటం జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసిన దాతలను సుధాకరరావు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని తన భుజ స్కందాలపై వేసుకుని ముందుకు నడిపించిన బిల్లా రమేష్, కార్యక్రమాన్ని సజావుగా రెండు చోట్ల నిర్వహించి విజయవంతం చేసిన మద్దిన ఈశ్వర్ నాయుడు, షేక్ బాషా, దుర్గాప్రసాద్ ఈడుపుగంటి, వి.సి.సుబ్బారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. తెలుగుదేశం నాయకురాలు రషీద భేగం, ఖాదరున్, కొల్లి ఆంజ నేయులు, వేణురాజు, సాయి, రాహుల్, రామరాజు, పోసు రాజు, వేణుగోపాల్ స్వామి, జనసేన నాయకులు కంచన శ్రీకాంత్, ఆంజన కుమార్ పగడాల, రామచంద్ర నాయక్, ఆకుల రాజేష్, ఇమ్మిడిసెట్టి సూర్యనారాయణ, జగిలి ఓబులేష్, తదితరులు పాల్గొన్నారు.





# మోదీ నేనూ చేతల మనుషులం!

## భారత ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంసల జల్లు



భారత ప్రధాని నరేంద్రమోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. మోదీ, తానూ చేతల మనుషులమంటూ వ్యాఖ్యానించారు. అయితే ఈ మాట చాలామందికి వర్తించదన్నారు. భారత్‌తో బంధం రానున్న రోజుల్లో మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ట్రంప్ మాటలను భారత్‌లోని యూఎస్ ఎంబసీ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలపై ప్రభావం చూపుతోన్న తరుణంలో అమెరికా నుంచి ఈ స్పందన వచ్చింది. ఇదిలాఉంటే.. రెండురోజుల క్రితం మోదీ ఫోన్ చేసిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచాల్సిన ఆవశ్యకత పైనా చర్చించినట్లు భారత్లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్' వేదికగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ సంభాషణ గురించి మోదీ కూడా స్పందించారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.



# బాలరాముడి నుదుటిపై 'సూర్య తిలకం'

## అయోధ్యలో సీబీఆర్ఏ అద్భుత ఆవిష్కరణ

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన మూడో శ్రీరామ నవమి ఇది. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై 'సూర్య తిలకం' చూసి భక్తులు పరవశించారు. ఈ పండగ వేళ... స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. అయోధ్య ఆలయంలో గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు పడేందుకు మూడో అంతస్తులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిమిత సంఖ్యలో పైపులు, కుంభాకార, పుటాకార కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు. ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటుచేశారు. అక్కడినుంచి పైపు లోపలికి కాంతి ప్రసరించి తిలకం వలె కన్పిస్తోంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) శాస్త్రవేత్తలు, పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ(సీబీఆర్ఎ) శాస్త్రవేత్తలు దీనిని నిర్మించారు.

ప్రతి శ్రీరామ నవమి రోజున బాలరాముడి నుదుటిపై ఈ తిలకం దిద్దేలా ఏర్పాట్లు చేశారు. అందుకోసం గడియారంలో ముల్లులు తిరిగేందుకు ఉపయోగించే పరిజ్ఞానం తరహాలో గేర్ టీత్ మెకానిజం వినియోగించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరం వద్దే మరో పరికరం ఉంచారు. ఇది కాంతిని గ్రహించే అద్దాన్ని 365 రోజులు స్వల్పంగా కదుపుతూ ఉంటుంది. మళ్ళీ శ్రీరామనవమి రోజు వారు అనుకున్న చోటుకు తీసుకొస్తుంది. అంతకుముందే ఏటా శ్రీరామనవమి వచ్చే కాలాన్ని అత్యం ఖచ్చితత్వంతో గణించారు.

# అవన్నీ బాధ్యతా రహిత ప్రచారాలు

## పుకార్లని కొట్టిపారేసిన కేంద్రమంత్రి

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో దేశీయంగా ఇంధన కొరత ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బారులు తీరుతున్నారు. మరోవైపు 'లాక్‌డౌన్ భయాలు వెంటాడుతున్నాయి.. ఈ నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ దీనిపై స్పష్టతనిచ్చారు. "లాక్డౌన్ వార్తలను కొట్టిపారేశారు. ఇందన లభ్యతకు కేంద్రం చర్యలను వివరిస్తూ వరుస ట్వీట్లు చేశారు. "అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఎనర్జీ, సరఫరా గొలుసు, అత్యవసర సరకు రవాణా వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. దేశంలో ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అయితే లాక్‌డౌన్‌పై వినిపిస్తోన్న ఊహాగానాలు పూర్తిగా అవాస్తవం. అలాంటి ప్రతిపాదనేది కేంద్ర ప్రభుత్వం వద్ద లేదు. ఇలాంటి వదంతులు సమాజానికి హాని చేస్తాయి. గందరగోళం సృష్టిస్తాయి. ఈ సమయంలో మనమంతా ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐకమత్యంగా ఉండాలి' అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. "గత నెల రోజుల్లో అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 122 డాలర్ల వరకు వెళ్లొచ్చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఆగ్నేయాసియా దేశాల్లో 30-50శాతం, ఉత్తర అమెరికాలో 30శాతం, ఐరోపాలో 20శాతం, ఆఫ్రికా దేశాల్లో 50శాతం మేర ఇంధన ధరలు పెరిగాయి. కానీ, మన దేశంలో పౌరుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ వీటిని పెంచలేదు. అంతేగాక, చమురు కంపెనీల అధిక నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వ పన్ను ఆదాయాన్ని తగ్గించుకున్నాం. (ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఉద్దేశిస్తూ). అదే సమయంలో విదేశాలకు ఎగుమతి చేసే ఇంధనంపై ఎగుమతి పన్ను విధించాం" అని పురి వెల్లడించారు. విదేశాలకు ఎగుమతి చేసే డీజిల్‌పై లీటర్ కు రూ.21.5 చొప్పున పన్ను విధించినట్లు కేంద్రం ప్రకటన విడుదల చేసింది. ఇక. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్) పై లీటరుకు రూ.20.5శాతం పన్ను విధిస్తున్నట్లు తెలిపింది. వాస్తవానికి 2024లో కేంద్రం ఇంధన ఎగుమతులపై పన్నులను తొలగించింది. అయితే, ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో వీటిని మళ్లీ ప్రవేశపెట్టింది.



# యూరియా కొరత రానివ్వం

## లోక్‌సభలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పష్టీకరణ



పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు తగ్గట్టు సరఫరా చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు. "ముడిసరకుల దిగుమతి విషయంలో ఒక్క దేశం పైనే ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ విషయంలో ఇప్పటికే అనేక దేశాలతో భారత్ సుదీర్ఘకాలానికి ఒప్పందాలు చేసుకుంది. ఔషధాల తయారీ కోసం ఇతర దేశాల నుంచి ముడిసరకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అంటూ జేపీ నడ్డా లోక్‌సభలో వివరించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో నిత్యావసరాలు, ఎరువుల సరఫరా గురించి చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఖరీఫ్ సీజన్ వరకూ ఎరువులకు కొరత ఉండదు. కానీ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.3 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల వాడకంలో భారత్ రెండో అతిపెద్ద దేశం. ఫెర్టిలైజర్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉంది. ఎల్ఎన్కో ధరల పెరుగదల కారణంగా యూరియా ఉత్పత్తి వ్యయాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. అదే సమయంలో, ఎరువులు, ముడి పదార్థాల రవాణా ఆలస్యం అవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# 50 శాతం విమానాల్లో సాంకేతిక లోపాలు



## పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర ఆందోళన

దేశంలోని పౌర విమానయాన రంగంలో భద్రతపై పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 50శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ తాజాగా వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించామని, తరచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొంది. జనవరి 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా 377 వాటిల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆడిట్ చేసిన వాటిలో ఇండిగో విమానాల సంఖ్యే ఎక్కువని.. లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నాయని కమిటీ వెల్లడించింది. ఫిబ్రవరి మూడు వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా 148 ఫ్లైట్లలో లోపాలు ఉన్నాయని పేర్కొంది. కొన్ని లోపాలు రిపీట్ అయ్యాయని చెప్పింది. 160 ఎయిరిండియా, 101 ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టారు. వాటిల్లోనూ లోపాలు. వెలుగు చూశాయి. దాదాపు సగం ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నాయి. ఈ స్థాయిలో లోపాలు వెలుగు చూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గతేడాది అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత.. ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్ ను కూడా నివేదిక ప్రస్తావించింది. ఆ ఆడిట్‌లో దాదాపు 100 భద్రతాలోపాలను గుర్తించారు. అందులో 7 ఉల్లంఘనలు లెవెల్-16 సంబంధించినవని, వాటివల్ల తీవ్ర ముప్పు పొంచి ఉండడంతో వెంటనే వాటిని సరిచూసుకోవాలని ఎయిరిండియాకు డీజీసీఏ సూచించిన సంగతి తెలిసిందే. విమానాల మోడళ్లను బట్టి.. శిక్షణ విషయంలో వ్యత్యాసాలు ఉండటాన్ని ప్రస్తావించింది. 2025 చివరినాటికి భద్రతా ఉల్లంఘనలకు సంబంధించి 19 నోటీసులను విమానయాన సంస్థలకు డీజీసీఏ జారీ చేసిందని, వాటిలో 10 నోటీసులు ఎయిరిండియాకే వెళ్లాయని వెల్లడించింది. సిబ్బంది కొరతను ప్రస్తావిస్తూ వేగంగా వృద్ధి చెందుతోన్న విమానయాన రంగాన్ని డీజీసీఏ పర్యవేక్షించే సామర్థ్యంపైనా ప్రశ్నలు లేవనెత్తింది.

# చరిత్ర సృష్టించనున్న ట్రంప్

**అమెరికా కరెన్సీ నోట్లపై అధ్యక్షుడి సంతకం?**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చరిత్ర సృష్టించనున్నారా? ఆయన తీసుకున్న సరికొత్త నిర్ణయం ఔనన్న సమాధానంవైపే మొగ్గుచూపుతోంది. ఆ దేశ కరెన్సీ నోట్లపై సంతకం చేయబోయే తొలి అధ్యక్షుడిగా ట్రంప్ నిలవనున్నారు. అదీ -సంచలన నిర్ణయం. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఈ విషయాన్ని ప్రకటించింది. త్వరలో జరగనున్న అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. 1861నుంచి అమెరికా కరెన్సీ నోట్లపై ట్రెజరర్, ట్రెజరీ కార్యదర్శి సంతకం ఉండడం సంప్రదాయంగా వస్తోంది. ఈ 165 ఏళ్ల సంప్రదాయాన్ని ట్రంప్ ఇప్పుడు బ్రేక్ చేయబోతున్నారు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. టెజ్రరీ కార్యదర్శి స్కాట్ బెస్టెంట్‌తో పాటు ట్రంప్ సంతకం ఉన్న తొలి 100 డాలర్ల నోట్లను జూన్‌లో ముద్రించనున్నట్టు పేర్కొంది. స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా ట్రంప్ ముఖచిత్రంతో స్మారక నాణెం రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా తాజా నిర్ణయం కూడా తీసుకున్నట్టు తెలుస్తోంది. దీనిపై బెసెంట్ మాట్లాడుతూ.. తమ దేశం సాధించిన చరిత్రాత్మక విజయాలను గుర్తు



చేసుకోవడానికి ఇంతకంటే గొప్ప మార్గం మరొకటి ఉండదని అభిప్రాయపడ్డారు. అమెరికన్ ట్రెజరర్ బ్రాండన్ బీజ్ కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించారు. ఇది సరైన నిర్ణయమేనని.. అందుకు ఆయన పూర్తి అర్హులని వ్యాఖ్యానించారు.

# హెచ్ 1బీలో మళ్లీ కొత్త రూల్స్!

**కనీస వేతనం 14వేల డాలర్లకు పెంచే యోచన**

టెక్ కంపెనీల్లో విదేశీయులను తగ్గించి అమెరికన్లకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అగ్రరాజ్యం మరో కీలక చర్యకు సిద్ధమైంది. ఇందులోభాగంగానే హెచ్-1బీ వీసాదారుల వేతనాలను పెంచేలా అమెరికా కార్మిక శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. ఇది అమల్లోకి వస్తే విదేశీ ఉద్యోగుల వార్షిక వేతనం 14వేల డాలర్లమేర పెరిగే అవకాశం ఉంది. అమెరికన్లతో పోలిస్తే విదేశీ ఉద్యోగులకు వేతనం విషయంలో భారీ వ్యత్యాసం ఉంటోందని, దీనివల్ల చౌకగా లభించే ఉద్యోగులకే కంపెనీలు మొగ్గు చూపుతున్నాయని సుదీర్ఘంగా ఆందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్య అధికారులు తాజా ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ప్రస్తుతం అమెరికాలో స్థానిక ఉద్యోగులతో పోలిస్తే హెచ్-1బీ వీసాదారులు సగటున 10,191 డాలర్లు తక్కువగా వార్షిక వేతనం అందుకుంటున్నారు. కంప్యూటర్ ఆధారిత వృత్తుల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంటోంది. వాస్తవానికి ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల కోసం హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చారు.




కానీ, అందుకు భిన్నంగా కొన్ని కంపెనీలు ఈ వీసాను దుర్వినియోగం చేసి తక్కువ వేతనం తీసుకునే ఉద్యోగులను విదేశాలనుంచి నియమించుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో జారీ అయిన హెచ్-1బీల్లో 63శాతం ఎంట్రీ లెవల్ ఉద్యోగస్థులే ఉన్నట్లు కార్మికశాఖ గణాంకాలు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే వేతన పెంపు ప్రతిపాదనలు చేసినట్టు అమెరికా అధికారులు వెల్లడించారు. అధ్యక్షుడి సంతకం తర్వాత ఈ ప్రతిపాదనలు అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి. కార్మిక శాఖ ప్రతిపాదనల ప్రకారం నాలుగంచెల వేతన వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు కనీస వేతనం 34శాతం, లెవల్ 2వారికి 52శాతం, లెవల్ 3 ఉద్యోగులకు 70శాతం, లెవల్ 4 ఉద్యోగులకు 88శాతం మేర పెంచాలని అగ్రరాజ్యం భావిస్తోంది. ఈ ప్రతిపాదనలతో హెచ్-1బీ వీసాదారుల సగటు వార్షిక వేతనం 14వేల డాలర్ల మేర పెరిగే అవకాశం ఉంది. దీంతో విదేశీ ఉద్యోగులను నియమించే కంపెనీలు ఏటా 6.56 బిలియన్ డాలర్ల వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది.



# పశ్చిమాసియాకు పదివేలమంది అమెరికా దండు

**- సమగ్ర వ్యూహాన్ని రూపొందిస్తున్న పెంటగాన్**

**- ఖర్గ్ సమీపానికి ఫైటర్‌జెట్లు, విమాన వాహన నౌకలు**

ఇరాన్‌పై యుద్ధ తీవ్రతను తగ్గిస్తామంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సైన్యాన్ని పశ్చిమాసియాకు తరలిస్తున్నారు. ఓ వైపు ఇరాన్‌తో చర్చలు జరుపుతూనే మరోవైపు అత్యాధునిక ఫైటర్ జెట్లను, విమాన వాహన నౌకలను పశ్చిమాసియాకు తరలిస్తున్నారు. తాజాగా మరో 10,000మంది అమెరికా పదాతిదళ సైనికులను మోహరించడానికి అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) సమగ్ర వ్యూహాలను రూపొందించినట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం వెలువరించింది. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. పదాతి దళాలతోపాటు పెద్ద మొత్తంలో సాయుధ వాహనాలను కూడా తరలిస్తున్నాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో మోహరించి ఉన్న 5,000 మంది మెరైన్ ఎక్స్‌పీడిషనరీ యూనిట్ (ఎంఈయూ) సభ్యులు, వెయ్యిమంది పారాట్రూపర్లతో కలిసి ఈ సిబ్బంది రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. గగనతలంలోనే ఫ్యూయల్ నింపుకొనే యుద్ధ విమానాలు, గైడెడ్ క్షిపణి డిస్ట్రాయర్లు పశ్చిమాసియా వైపునకు మళ్లాయి. ఈ దళాలను ఇరాన్‌తో పాటు పర్షియన్ గల్ఫ్‌లోని కీలకమైన ఖర్గ్ ద్వీపం సమీపంలో మోహరించేందుకు అమెరికా సిద్ధమవుతోంది.

**హర్మూజ్ విషయంలో చర్యలకు సిద్ధం...!**

హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ట్రంప్ సంకేతాలిచ్చారు. మిత్ర దేశాల మద్దతు ఉన్నా, లేకపోయినా కీలకమైన ప్రపంచ నౌకా రవాణా మార్గమైన హర్మూజ్‌ను తిరిగి తెరిపించడానికి అమెరికా కట్టుబడి ఉందని తెలిపారు. ఈమేరకు ఆ దేశ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయన్నారు. టెహ్రాన్ ప్రభుత్వం అభ్యర్థన మేరకు ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడుల నిలిపివేతను ఏప్రిల్ 6 వరకు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నారు.

# కలుషితమైన సముద్రం



**600 కి.మీ మేర చమురు తెట్టు - జల చరాలపై పెను ప్రభావం**

గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో 600 కి.మీ మేర భారీ చమురు తెట్టు ఏర్పడిందని మెక్సికన్ అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలతో సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు, ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడం వల్ల ఈ ముప్పు సంభవించిందన్నారు. ఐదు నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని తూర్పు రాష్ట్రమైన వెరాక్రూజ్‌లో ముడి చమురు సహజంగా ఊరే ఒక పైప్‌లైన్ పగిలిపోయినట్టు అధికారులు పేర్కొన్నారు. దానినుంచి లీకైన చమురు పాంటెపెక్ నది, టబాస్కో దక్షిణ రాష్ట్రాలలోని 200 కిలోమీటర్ల తీరప్రాంతంతో సహా 600 కి.మీ వ్యాపించింది. కాంపెచే బేలో ఉన్న మరొక సహజ చమురు ఊట కూడా సముద్రతీరంలో వ్యాపిస్తున్నట్టు గుర్తించామన్నారు. ఇప్పటికీ అందులోనుంచి చమురు లీక్ అవుతుందన్నారు. గత నెల రోజులుగా వాటినుంచి పెద్ద మొత్తంలో కలుషితాలు వెలువడుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు మూడు నెలల క్రితం గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో చమురు నౌక బోల్తా పడడంతో.. సముద్రంలో చమురు లీక్ అయ్యిందని అధికారులు తెలిపారు. దానివల్ల వందల సంఖ్యలో సముద్ర తాబేళ్లు, చేపలతో సహా వివిధ జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. వెరాక్రూజ్ రాష్ట్రంలోని ఐదు అభయారణ్యాలు, బయోస్పియర్ రిజర్వ్, నేషనల్ పార్కుల్లో వ్యాపించిన చమురు కలుషితాలను తమ సిబ్బంది శుభ్రం చేస్తున్నారన్నారు.

# తగ్గేదే లే..!

***అమెరికాను ఢీకొట్టేందుకు ఇరాన్ సన్నాహాలు***

***10 లక్షల సేనను సిద్ధం చేస్తున్న వైనం...***



ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. ఓవైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్టు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నట్లు వెల్లడించాయి..

**12 ఏళ్ల పిల్లలు సైతం యుద్ధంలోకి..**

ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్టు తెలుస్తోంది. 12ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్టు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు.

**ఇజ్రాయెల్ సైనికుల కొరత..**

ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్టు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు.

# మేం ఖతార్‌లాంటి కాదు

**ఇజ్రాయెల్‌కు పాక్ హెచ్చరిక**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని పాక్ రాయబార కార్యాలయం సమీపంలో వైమానిక దాడి జరిగింది. దీనిపై పాకిస్థాన్ తీవ్రంగా స్పందిస్తూ ఇజ్రాయెల్‌కు గట్టి హెచ్చరికలు చేసింది. తాము ఖతార్ మాదిరి కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. టెహ్రాన్‌లోని పాక్ ఎంబసీకి అత్యంత సమీపంలో దాడి జరిగింది. ఘటనలో పాక్ దౌత్య కార్యాలయానికి, అధికారులకు ఎటువంటి హానీ జరగలేదు. కానీ సమీపంలోని పలు భవనాలు తీవ్రంగా ధ్వంసమైనట్టు అధికార వర్గాల సమాచారం. అమెరికా- ఇరాన్ల మధ్య సంధి కోసం ఇస్లామాబాద్ ప్రయత్నిస్తున్న సమయంలో ఈ దాడి జరగడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై పాక్ స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తంచేసింది. "పాకిస్థాన్.. ఖతార్ మాదిరి కాదనే విషయాన్ని ఇజ్రాయెల్ గుర్తుపెట్టుకోవాలి. ప్రపంచంలో ఎక్కడైనా మా దౌత్యవేత్తలకు హాని జరిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయి" అని పాక్ హెచ్చరించింది. అయితే, ఈ దాడులపై ఇజ్రాయెల్‌గానీ, అమెరికాగానీ ఇంకా స్పందించలేదు. ఇదిలాఉండగా.. పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు కోసం మధ్యవర్తిత్వానికి పాక్ ప్రయత్నాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. "ఇరు పక్షాలు అంగీకరిస్తే.. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు ఆతిథ్యం ఇవ్వడానికి ఇస్లామాబాద్ సిద్ధంగానే ఉంది" అని పాక్ అధికారులు వెల్లడించారు.

# అన్నా ఇచ్చిన అన్‌సీన్ గిఫ్ట్!



రామ్‌చరణ్ పుట్టినరోజున ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా, సోషల్ మీడియా అంతా చరణ్ బర్త్‌డే పోస్టులతో నిండి పోయింది. ముఖ్యంగా మెగా ఫ్యామిలీ సభ్యులు షేర్ చేసిన ప్రత్యేక ఫోటోలు, సందేశాలు నెట్టింట వైరల్ అవుతున్నా యి.అయితే చరణ్ వ్యక్తిత్వం,వినయం, కష్టపడి ఎదిగిన తీరు గురించి తెలిసిన వారు ఈ రోజును పండుగలా జరుపుకుంటున్నారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన చరణ్‌కు ఇప్పుడు వస్తున్న బర్త్‌డే విషెస్ రేంజ్ మరింత పెరిగింది.అభిమానుల ప్రేమ, సెలబ్రిటీల ప్రశంసలు ఈ బర్త్‌డేను మరింత స్పెషల్‌గా మార్చాయి. బర్త్‌డే సందర్భంగా ఒక అన్‌సీన్ ఫోటో సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజ్నెవా తన కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌తో కలిసి చరణ్‌వున్న ఒక క్యూట్ ఫోటోను షేర్ చేస్తూ బర్త్‌డే విషెస్ తెలిపారు. "మార్క్ మరియు మా కుటుంబం తరపున చరణ్ అన్నకు హ్యాపీ బర్త్‌డే" అంటూ ఆమె చేసిన పోస్ట్ అభిమానులను ఆకట్టుకుంది. ఆ ఫోటోలో చరణ్ పక్కన కూర్చుని మార్క్ ఫోన్ చూస్తుండగా, చరణ్ ఎంతో ప్రేమగా అతన్ని గమనిస్తున్న తీరు నెటిజన్లను ఫిదా చేసింది.సాధారణంగా పవన్ కళ్యాణ్ కుటుంబానికి సంబంధించిన ఫోటోలు చాలా అరుదుగా బయటకు వస్తుంటాయి. అలాంటిది ఈ సందర్భంలో బయటకు రావడంతో మెగా ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.


# ప్రస్తుతానికి కెరీర్‌పైనే ఫోకస్

డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచం లోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన సాయి పల్లవి ప్రయాణం నిజంగా స్ఫూర్తి దాయకం. ప్రేమమ్ సినిమాలో 'మలర్ టీచర్' పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన,తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు 'లేడీ పవర్‌స్టార్' అనే ట్యాగ్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్‌తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రామాయణంలో సీత పాత్ర పోషించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలావుంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయిపల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. "ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను" అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది.

సాధారణంగా ఇలాంటి ప్రశ్నలకు స్టార్ హీరోయిన్లు ఊహించని సమాధానాలు ఇస్తుంటారు. కానీ సాయి పల్లవి మాత్రం ఎలాంటి సందేహాలకు తావు లేకుండా సూటిగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంది. ఇక ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురు చూస్తున్నారు. ఏదేమైన పెళ్లి కంటే కెరీర్‌నే ప్రాధాన్యంగా తీసుకుంటూ ముందుకు సాగుతున్న సాయిపల్లవి నిర్ణయం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.



# గ్లింప్స్‌తో కుమ్మేశాడుగా..




రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు 'పెద్ది' టీమ్ స్పెషల్ ట్రీట్ అందించింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ రూరల్ స్పోర్ట్స్ డ్రామానుంచి మార్చి 27న సరికొత్త టీజర్ విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన మొదటి టీజర్‌లో చరణ్ క్రికెట్ ప్లేయర్‌గా కనిపించి ఆకట్టుకోగా, తాజా టీజర్‌లో మాత్రం పూర్తిగా భిన్నమైన మాస్ అవతార్‌లో దర్శనమిచ్చాడు. కుస్తీ పోటీల్లో పాల్గొనే శక్తివంతమైన యోధుడిగా కనిపించిన తీరు అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. భారీ దేహదారుఢ్యం, కఠినమైన చూపులు, రఫ్ లుక్ అన్నీ చరణ్ పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా చూపిస్తున్నాయి. ఈ టీజర్ ద్వారా సినిమా నేపథ్యం, కథ గురించి కొంత క్లారిటీ వచ్చింది. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో స్థానిక క్రీడలు, ముఖ్యంగా కుస్తీ పోటీలు కీలక పాత్ర పోషించనున్నట్టు తెలుస్తోంది. చరణ్ ఫిజిక్, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తోంది. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ప్రాజెక్ట్‌లో ఆమె పాత్ర కూడా ఆసక్తికరంగా ఉండబోతుందని సమాచారం. ఈ భారీ సినిమా ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే టీజర్‌తోనే భారీ బజ్ క్రియేట్ చేసిన 'పెద్ది', విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.

# మరింత హైప్ క్రియేట్ చేయడానికే...

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా రామాయణ ఇతివృత్తంతో రూపొందుతున్న సినిమాల నుండి అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. ఈ క్రమంలోనే సుమారు రూ.4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'రామాయణ' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పవిత్ర రోజున సినిమాకు సంబంధించిన ఏదైనా గ్లింప్స్ విడుదలవుతుందని ఆశించిన అభిమానులకు నిరాశే ఎదురైంది. నేడు ఎటువంటి గ్లింప్స్ విడుదల చేయడం లేదని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దీనికి బదులుగా ఏప్రిల్ 2న హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరాముడి మొదటి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్టు నిర్మాత నమిత్ మల్హోత్రా వెల్లడించారు. రణ్‌బీర్‌కపూర్, సాయిపల్లవిలను రాముడు, సీత పాత్రల్లో చూడాలనుకున్న అభిమానులకు ఈ వేచి ఉండటం కొంత అసంతృప్తిని కలిగించినప్పటికీ, టీమ్ మాత్రం మరింత హైప్ క్రియేట్ చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కనిపిస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో యష్, సన్నీ డియోల్, వివేక్ ఒబెరాయ్ మరియు రవి దూబే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్. రెహమాన్ మరియు హన్స్ జిమ్మర్‌వంటి దిగ్గజాలు సంగీతాన్ని అందిస్తుండగా, శ్రీధర్ రాఘవన్ స్క్రీన్ ప్లే సమకూర్చుతున్నారు. ఈ చిత్రం 'రామాయణ: పార్ట్ 1'గా 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.





# 'ఆ విషాన్ని నిషేధించండి'

నటుడు, సినీ రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మరణించారు. ఈ విషాద వార్తను పంచుకుంటూ రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా చేసిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పారాక్వాట్‌వంటి ప్రాణాంతక రసాయనాలు మార్కెట్‌లో ఎంత సులభంగా అందుబాటులో ఉన్నాయో వివరించాడు. ఈ విషప్రయోగం వల్ల సంభవించే మరణాల సంఖ్యను చూసి వైద్యులు కూడా దిగ్భ్రాంతికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి బహిరంగ విన్నపం చేశారు. పారాక్వాట్ అనేది చాలా శక్తివంతమైన రసాయనమని, దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడంవల్ల ఇది శరీరంలోకి వెళ్ళిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు మరియు కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం మార్కెట్లలోనే కాకుండా ఈ-కామర్స్ సైట్లలో కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని, దీనిని ఆత్మహత్యలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని వివరించారు. ఇలాంటి ప్రాణాంతక మందును తక్షణమే నిషేధించి మరిన్ని ప్రాణాలు పోకుండా కాపాడాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. ఇప్పటికే పలు దేశాల్లో నిషేధానికి గురైన ఈ రసాయనంపై భారత్‌లో కూడా ఆంక్షలు విధించాలనే డిమాండ్‌కు నెటిజన్ల నుండి పెద్దఎత్తున మద్దతు లభిస్తోంది





# ఆ ముగ్గుర్నీ మర్చిపోకండి..

జీవితంలో ముగ్గురిని ఎప్పటికీ మర్చిపోకూడదని నటుడు శర్వానంద్ అన్నారు. 'బైకర్' మూవీతో పలకరించేందుకు సిద్ధమైన ఆయన ఈ చిత్రం ప్రచారంలో భాగంగా ఒక కాలేజ్ ఈవెంట్‌కు హాజరయ్యారు. అక్కడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు."ఇప్పుడిప్పుడే కొంచెం మాట్లాడటం నేర్చుకుంటున్నాను. మీకొక నిజం చెప్తా. లైఫ్ అనేది సినిమా లాంటిదికాదు. జీవితంలో బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఉండదు. కానీ కష్టాలు మాత్రం ఫుల్ సౌండ్‌తో ఉంటాయి.నేను యావరేజ్ స్టూడెంట్‌ని. ఎందుకూ పనికిరానని అందరూ తిట్టేవాళ్లు. 17ఏళ్ల వయసులో హీరో అవుతానంటే.. ఎవరూ నమ్మలేదు. 'నువ్వు హీరో ఏంటి.. అంత సీన్ లేదు..ఇండస్ట్రీలో నిలదొక్కుకోలేవు' అని చాలామంది అవమానించారు. కానీ ఈరోజు నేను ఈ స్టేజ్ మీద మాట్లాడగలుగుతున్నా. 23ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నా". "బైకర్ నా కెరీర్‌లో 36వ చిత్రం. మనం తలుచుకుంటే ఏదైనా చేయగలం. నిరుత్సాహపరిచేలా ఎవరైనా మాట్లాడితే వారి మాటలు వినొద్దు. మన విజయంతోనే అవమానించిన వారికి సమాధానం చెప్పాలి. జీవితంలో ముగ్గురిని మాత్రం మర్చిపోకండి. మీ కష్టంలో మీతో ఉన్న వాళ్లని, మీరు కష్టంలో ఉన్నప్పుడు వదిలేసిన వాళ్లని, మిమ్మల్ని కష్టంలోకి నెట్టినవాళ్లని ఎప్పటికీ మర్చిపోకండి" అని శర్వానంద్ చెప్పారు. పక్కవారితో పిల్లల్ని ఎప్పుడూ పోల్చొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు సపోర్ట్ చేస్తే పిల్లలు ఏదైనా సాధిస్తారని తెలిపారు. అభిలాష్రెడ్డి దర్శకత్వంలో శర్వానంద్, మాళవికా నాయర్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'బైకర్' ఏప్రిల్ 3న విడుదల కానున్న విషయం తెలిసిందే.